



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY



విశ్వంవాయిస్

వార్తా ప్రపంచం ఇప్పుడు మీ చేతుల్లో!

ఈ-పేపర్ కోసం వెంటనే స్కాన్ చేయండి!

వెంటనే స్కాన్ చేయండి!

పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా మీ ఫోన్‌లో మా డిజిటల్ దినపత్రికను పొందండి.

ఇప్పుడే చదవండి!



SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 246 | తూర్పుగోదావరి జిల్లా | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 28 మే 2026 | పేజీలు : 12 | వెల : 2/-






## టీడీపీ పనిచేసేది ఎన్నికల కోసం కాదు..

# నెక్స్ట్ జనరేషన్ కోసం

- జెన్ జీ, జెన్ ఆల్ఫాకు విస్తృత అవకాశాలు... అందిపుచ్చుకోండి
- రాష్ట్రాన్ని 5 ఏళ్లు విధ్వంసం చేస్తే... రెండేళ్లలో గట్టెక్కించాం
- రక్తచరిత్ర రాసేవాళ్లు స్వర్ణాంధ్ర చరిత్ర రాయలేరు
- గొడ్డలి పార్టీకి గోల్ లేదు... అదొక అడ్డగోల్ బ్యాచ్
- మహానాడు సభలో టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు
- ప్రభుత్వ విజయాలు, పార్టీకి నిర్దేశంతో సాగిన సీఎం ప్రసంగం
- మహిళల పోరాటాలకు గౌరవంగా మహానాడు అంకితం

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్నికల కోసం కాదు, భవిష్యత్ తరాల కోసం పనిచేస్తోన్న పార్టీ తెలుగుదేశం అని... గత పాలకులు రాష్ట్రాన్ని ధ్వంసం చేస్తే... రెండేళ్లలో రాష్ట్రాన్ని గట్టెక్కించి, వ్యవస్థలను గాడిలో పెట్టి, ఏపీ బ్రాండ్ ఇమేజ్ తిరిగి తీసుకువచ్చామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని తిరిగి నిలబెట్టేలా రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పనిచేసిందని చెప్పారు. పాలనలో అగ్రెసివ్‌గా, ప్రోగ్రెసివ్‌గా ముందుకు వెళ్తున్నామన్నారు. మహిళల సాధికారత, రాష్ట్రానికి పెట్టుబడులు - యువతకు అవకాశాలు, ప్రతీ ఎకరానికి సాగునీరు, అద్భుత రాజధానిగా అమరావతి నిర్మాణం, పేదవారికి సైతం అత్యుత్తమ వైద్యం, అందరికీ చదువు, అసమానతలు రూపుమాపడం, స్వర్ణాంధ్రను సాధించడమే టీడీపీ లక్ష్యమని... ప్రజలు ఇచ్చిన అఖండ విజయానికి సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనతో రుణం తీర్చుకుంటున్నామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయం వేదికగా బుధవారం జరిగిన మహానాడు సభలో ముఖ్యమంత్రి మిగతా .. 2లో..

---

రూ.4 లక్షల కోట్లకు చేరువలో

## భారత అంతరిక్ష పరిశ్రమ

మంత్రి రామ్మోహన్ నాయుడు



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత తొలి సూపర్ ప్రెజర్ బెలూన్‌ను కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు విజయవాడలో ఆవిష్కరించారు. రెడ్ బెలూన్ ఏరో స్పేస్ ఆధ్వర్యంలో ఈ బెలూన్‌ను రూపొందించారు. పాలిమర్ మిగతా .. 2లో..

---

ఓట్ల తొలగింపుపై

## వైసీపీ శ్రేణులను హెచ్చరించిన జగన్

మమత, స్టాలిన్ ఓటమికి ఎస్ఐఆరే కారణమని ఆరోపణ
పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచన



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో భారీ ఎత్తున ఓట్లను తొలగించడం వల్లే మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్ వంటి కీలక నేతలు సైతం తమ నియోజకవర్గాల్లో ఓటమి పాలయ్యారని సంచలన ఆరోపణలు చేశారు. ఇదే తరహా ఎస్ఐఆర్ ప్రక్రియ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోనూ జరగనున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో ఓట్ల తొలగింపుపై అనేక రాజకీయ పార్టీలు మిగతా .. 2లో..

---

## ప్రధాని మోదీతో విజయ్ భేటీ..

తమిళనాడు సీఎం అయ్యాక తొలిసారి



**ఢిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తమిళనాడు సీఎం విజయ్ బుధవారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. తొలుత ఢిల్లీలోని తమిళనాడు భవన్‌కు చేరుకున్న విజయ్.. అనంతరం ప్రధాని కార్యాలయానికి వెళ్లి మోదీని మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం అయ్యాక ఆయన తొలిసారి ప్రధానితో సమావేశమయ్యారు. దాదాపు 25 నిమిషాలపాటు సాగిన ఈ భేటీలో.. తమిళనాడుకు సంబంధించిన పలు అంశాలపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. అనంతరం ఇరువురు నేతలు కలిసిన సందర్భంగా తీసిన ఫొటోలను పీఎంవో 'ఎక్స్' వేదికగా పోస్టు చేసింది. ఇటీవల నెదర్లాండ్స్ పర్యటన సందర్భంగా 'అనైమంగళం' రాగి శాసనాలను తిరిగి భారత్‌కు రప్పించడంలో ప్రధాని మోదీ చేసిన కృషికి సీఎం విజయ్ కృతజ్ఞతలు తెలిపారని పేర్కొంటూ తమిళనాడు ప్రభుత్వం ఓ ప్రకటన విడుదల చేసింది. మేకెదాటు డ్యామ్ వివాదం అంశంపైనా ప్రధానితో మిగతా .. 2లో..

---

ఏపీ మద్యం కుంభకోణం కేసు..

వాసుదేవరెడ్డిని

## విచారిస్తున్న ఈడీ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ఏ2గా ఉన్న వాసుదేవరెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో ఉన్న ఈడీ కార్యాలయంలో అధికారులు ఆయన్ను ప్రశ్నిస్తున్నారు. నాలుగు గంటలుగా విచారణ కొనసాగుతోంది. వైకాపా మద్యం ముఠాతో కలిసి కుట్రకు మిగతా .. 2లో..

---

గోదావరిలో కాలుష్య నివారణకు

## ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలోని గోదావరితో పాటు ఇతర నదుల్లో కాలుష్య నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమ, మంగళవారాల్లో రాజమహేంద్రవరంలో పర్యటించి పుష్కరాల సమయానికి గోదావరిలో కాలుష్య నివారణ చర్యలు జరగాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ కాలుష్యం జరుగుతుందో (పొల్యూషన్ ఆడిట్) క్షేత్రంలో గుర్తించి, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేసేందుకు ఆరు జిల్లాల అధికారులతో మిగతా .. 2లో..

---

గాంధీభవన్‌లో

## కాంగ్రెస్ నేతల ఘర్షణ

కిందపడిన ఫిరోజ్‌ఖాన్



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ సమావేశంలో ఘర్షణ చోటుచేసుకుంది. గాంధీభవన్‌లో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజహరుద్దీన్ సమక్షంలోనే నేతలు మిగతా .. 2లో..

---

## 'తుమ్మిడిహట్టి'పై చర్చించేందుకు సిద్ధం..

మహారాష్ట్ర సీఎంకు తెలంగాణా సీఎం రేవంత్ లేఖ



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** తుమ్మిడిహట్టి బ్యారేజీ అంశంపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌కు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి లేఖ రాశారు. ఈ వ్యవహారంలో మహారాష్ట్రతో చర్చించేందుకు సిద్ధమని అందులో పేర్కొన్నారు. తెలంగాణ ప్రతినిధులకు సమయం ఇవ్వాలని.. భేటీకి తేదీ ఖరారు చేయాలని కోరారు. గతంలో 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌కు (ఫుల్ రిజర్వాయర్ లెవల్) మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని.. దీంతో ఉత్తర తెలంగాణ నీటి అవసరాలు తీరవని రేవంత్ పేర్కొన్నారు. ఎఫ్ఆర్ఎల్ పెరిగితే గ్రావిటీ ద్వారా తెలంగాణకు నీళ్లొస్తాయని వివరించారు. ఎఫ్ఆర్ఎల్ పెంచినా.. మహారాష్ట్రలో ముంపు ప్రభావం తక్కువేనని రేవంత్‌రెడ్డి వివరించారు.

---

'మహానాడు'ను 'దగానాడు'గా

## అభివర్ణించిన రోజా

టీడీపీ మహానాడుపై రోజా తీవ్ర విమర్శలు




**తాడేపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వైసీపీ నేతలు విమర్శల జోరు పెంచారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఆర్కే రోజా కూటమి పాలనపై, ముఖ్యంగా నారా లోకేశ్ మిగతా .. 2లో..

---

ఏపీ కాంగ్రెస్ చీఫ్

## వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు?

కర్ణాటక కోటా నుంచి షర్మిలకు కేటాయించే అవకాశం



**విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు ఇస్తామని గతంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ ఇప్పుడు నెరవేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. కర్ణాటక రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి లభించే మూడు రాజ్యసభ స్థానాలకు గాను వైఎస్ షర్మిల పేరును అధిష్ఠానం ప్రముఖంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ స్వయంగా ఇచ్చిన మాట ప్రకారం ఆమెను కర్ణాటక కోటా నుంచి ఎగువసభకు పంపించేందుకు ఢిల్లీ స్థాయిలో జోరుగా కసరత్తు సాగుతోంది. ఈ స్థానాల కోసం కర్ణాటక స్థానిక నేతలైన బీకే హరిప్రసాద్, రాజీవ్ గౌడ పేర్లు ప్రముఖంగా వినపడుతుండగా, మిగతా .. 2లో..

---

## పాక్ మధ్యవర్తిత్వమే పెద్ద సమస్య

ట్రంప్ సన్నిహిత సెనెటర్



**విశ్వం వాయిస్ న్యూస్ :** పాకిస్థాన్‌పై అమెరికా సెనెటర్ లిండ్సేగ్రాహం తీవ్రంగా మండిపడ్డారు. అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతోన్న శాంతి చర్చల్లో పాక్ మధ్యవర్తిత్వం వహిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదే పెద్ద సమస్య అంటూ పాక్‌పై విమర్శలు చేశారు. ఇరాన్‌తో శాంతిచర్చల్లో పాల్గొంటున్న దేశాలు అబ్రహాం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. అయితే, ఇజ్రాయెల్‌తో వైరం నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ దీన్ని తోసిపుచ్చారు. ఈ క్రమంలోనే లిండ్సే పాక్ వ్యవహారంపై విరుచుకుపడుతూ ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. పాక్ మధ్యవర్తిగా వ్యవహరించడమే అతిపెద్ద సమస్య అని పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌పై సుదీర్ఘకాలంగా అది విద్వేషంతో రగిలిపోతోందన్నారు. టెల్అవీవ్‌కు వ్యతిరేకంగా గతంలో పాక్ ఉన్నతస్థాయి అధికారులు చేసిన వ్యాఖ్యలు ఆందోళనకరంగా మిగతా .. 2లో..

---

కడప జిల్లాలో 15 ఏళ్ల బాలికపై

## అత్యాచారం

**కడప, విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లాలో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. సోషల్ మీడియా ద్వారా పరిచయమైన యువకుడు, పదో తరగతి పూర్తి చేసిన ఓ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలిక ప్రస్తుతం కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు, అతని కోసం గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. దువ్వూరు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

### టీడీపీ పనిచేసేది ఎన్నికల కోసం కాదు...

# నెక్ట్స్ జెనరేషన్ కోసం

మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం సాధించిన విజయాలు, పార్టీకి దిశా నిర్దేశంతో సీఎం ప్రసంగం సాగింది. రెండు రోజుల పాటు సాగే వర్చువల్ మహానాడుకు భారీ స్పందన వచ్చింది. మహానాడు ప్రారంభ సమయంలోనే భారీగా రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. 1,864 క్లస్టర్ల నుంచి దాదాపు 2.23 లక్షల మంది మహానాడు కార్యక్రమానికి హాజరయ్యారు. వర్చ్యువల్ మీటింగ్‌పైన కార్యకర్తలు ఎంతో ఆసక్తి కనబరిచారు.

**కార్యకర్తల్లో జోష్ తగ్గలేదు**

జై తెలుగుదేశం నినాదంతో ప్రసంగాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి... వర్చువల్ మహానాడు కారణంగా వాహనాల హోరు తగ్గిందేమో కానీ, కార్యకర్తల్లో జోష్ తగ్గలేదన్నారు. అన్ని క్లస్టర్లను అనుసంధానించి మహానాడును నిర్వహించుకుంటున్నామని, పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా మహానాడును ఈసారి హైబ్రీడ్ పద్దతిలో జరుపుతున్నామని చెప్పారు. మీటింగ్ మోడల్ మారిందే తప్ప... మహానాడు విధానం మారలేదన్నారు. కూడు, గూడు, గుడ్డ నినాదంతో ఆవిర్భవించిన టీడీపీ... విజన్ పాలిటిక్స్‌కు రూపం ఇచ్చిందన్నారు. జాతీయ జెండా దేశానికి గౌరవం, పసుపు జెండా తెలుగువారికి ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు. ప్రతీ ఒక్కరికీ తెలుగుదేశం జెండా చూస్తేనే నమ్మకం, ధైర్యం, భరోసా కలుగుతుందన్నారు. నాటికి, నేటికి తెలుగుదేశం పార్టీపై ప్రజల్లో ఆదరణ మాత్రం చెక్కు చెదరలేదన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు ఎదురైనా ప్రజల కోసం 45 ఏళ్లుగా టీడీపీ పోరాటం చేస్తూనే ఉందన్నారు. నరహంతకులు పీకలు కోస్తున్నా.. టీడీపీ కార్యకర్తలు తెలుగు దేశం జెండాను మాత్రం వదలకుండా అభిమానం చూపారన్నారు. చంద్రయ్య లాంటి కార్యకర్తను ప్రత్యర్ధి పార్టీల వారు నరుకుతున్నా జై చంద్రబాబు, జై తెలుగుదేశం అంటూ నినదించి అమరుడయ్యారని గుర్తు చేశారు. ఆయన స్పూర్తి కలకాలం నిలుస్తుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో తనను కూడా అక్రమంగా జైల్లో పెట్టారని, లోకేష్ యువగళాన్ని అడ్డుకున్నారని, ఎంతోమంది పార్టీ నేతల్ని, కార్యకర్తలపై అన్యాయంగా కేసులు పెట్టి అరెస్టు చేశారని వివరించారు. బాధితుల్నే నిందితులుగా చేసినా ఏ టీడీపీ నాయకుడూ, కార్యకర్తా వెనకడుగు వేయలేదని కొనియాడారు. ప్రజాస్వామ్యాన్ని బతికించేందుకు 2024 ఎన్నికల్లో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడ్డామని... ప్రజలు ఆదరించి, ఆశీర్వదించారని చెప్పారు.

**మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర**

'మహిళా సాధికారిత కోసం, సామాజిక, ఆర్ధిక రాజకీయ గౌరవం కోసం ప్రజా ప్రభుత్వం పనిచేస్తోంది. ఆస్తి హక్కు నుంచి నేడు తల్లికి వందనం వరకూ అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టింది. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించటంతో పాటు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు సాధించే వరకూ టీడీపీ వారి వెనుక నిలబడుతుంది. విద్య, ఉద్యోగం, ఉపాధికి ఆర్ధికంగా మహిళలకు వెసులుబాటు ఇచ్చేలా కార్యక్రమాలు చేపడుతున్నాం. స్త్రీ శక్తి ద్వారా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. దీపం 2.0 పథకం ద్వారా ఉచితంగా ఏడాదికి 3 గ్యాస్ సిలెండర్లు ఇస్తున్నాం. గత ఏడాది లక్ష మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్‌లుగా తీర్చిదిద్దాం. మరో 5 లక్షల మంది మహిళల్ని ఎంట్రప్రెన్యూర్లుగా మార్చేలా కార్యాచరణ చేపట్టాం. స్వయం ఏపీ పేరుతో డ్వాక్రా మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పిస్తున్నాం. మొన్నటి విజయంలో మహిళలదే కీలక పాత్ర. ప్రజా క్షేత్రంలో పోరాడి పార్టీని గెలిపించారు. అందుకే ఈ మహానాడును ఆడబిడ్డలకు అంకితం చేసేలా మహిళా మహనాడుగా ప్రకటిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి అన్నారు.

**యువతకు విస్తృత అవకాశాలు కల్పిస్తాం**

యువత గురించి ముఖ్యమంత్రి మాట్లాడుతూ.... 'ఏ పాలసీ చేసినా అది యువత కోసమే చేస్తున్నాం. ఉమ్మడి రాష్ట్రంలో ఐటీ పాలసీతో యువతకు ఉద్యోగాలు వచ్చాయి. ఎన్నికల సమయంలో ప్రస్తుత టీడీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ రాష్ట్రమంతటా పర్యటించి యువగళం పాదయాత్రలో హామీలు ఇచ్చారు. దానికి అనుగుణంగా జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ల ఆలోచనలకు అనుగుణంగా విధానాలు రూపొందించి అవకాశాలు కల్పిస్తాం, సహకారం అందిస్తాం. ఏఐ, క్వాంటం, స్పేస్, ఏరోస్పేస్, ఆటోమొబైల్, సెమీ కండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ ఇలా అన్ని రంగాల్లో ఏపీ చిరునామాగా ఉంటుంది. 23 నెలల్లో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి... తద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు కూడా వచ్చేందుకు వీలు కలిగింది. ఇప్పటికే రూ.11.27 లక్షల కోట్ల పెట్టుబడులకు సంబంధించి 282 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ద్వారా ఆమోదం తెలిపాం. పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్, రేర్ ఎర్త్ మినరల్స్ , 5 తరం ఫైటర్ జెట్ యుద్ధ విమాన ప్రాజక్టు కూడా రాష్ట్రానికి వస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కాదు గేర్ మార్చి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా పరిశ్రమలకు వేగంగా అనుమతులు ఇస్తున్నాం. కేవలం 36 రోజుల్లోనే ఫైటర్ జెట్ యుద్ధ విమాన తయారీ, టెస్టింగ్ ప్రాజెక్టుకు అనుమతులు ఇచ్చాం. ఆ స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తోనే తిరుపతిలో రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్ మోటారు సైకిల్ ప్రాజెక్టు వచ్చింది. ఇది ఇన్ స్పైరింగ్ టైమ్ అని జెన్ జీ, జెన్ ఆల్ఫా, టీనేజర్ వర్గానికి పిలుపునిస్తున్నాను. యువతకు ఉద్యోగాలు-ఉపాధి వంటి అంశాల్లో వారి కంటే ముందే ఆలోచన చేసి అందుకు అనుగుణంగా విధానాలు రూపొందిస్తున్నాం. ఆకాశమే హద్దుగా యువత రాష్ట్రంలోని అవకాశాలు వినియోగించుకోవాలి. నచ్చిన రంగాన్ని ఎంచుకుని వన్ ఎంట్రప్రెన్యూర్ - వన్ ఫ్యామిలీ లక్ష్యం చేరుకోవాలి. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మందికి ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిది. 5,757 మంది కానిస్టేబుళ్లను రిక్రూట్మెంట్ పూర్తి చేసిన ప్రభుత్వం మనది. 10 వేలకు పైగా పోస్టులతో 2026 జాబ్ కేలండర్‌ను కూడా విడుదల చేశాం.' అన్నారు.

**సంక్షేమం-అభివృద్ధి-సుపరిపాలనకు అర్థం చెప్పాం**

'రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత 23 నెలల్లో దాదాపు రూ.63వేల కోట్లకు పైగా మొత్తాన్ని సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఖర్చు పెట్టాం. ఇది దేశంలోనే రికార్డు. మరోవైపు రైతన్నను అన్ని విధాలా ఆదుకున్నాం. గత పాలకులు రైతాంగాన్ని నిర్వీర్యం చేశారు. వారికి ఏడాదికి రూ.7,500 మాత్రమే సాయంగా ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.14 వేలను ఏడాదికి అన్నదాత సుఖీభవ కింద ఇస్తున్నాం. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న ఆక్వా రైతులకు ఈ జూన్ మొదటి తేదీ నుంచి యూనిట్ విద్యుత్ రూ.1.50 ఇవ్వాలని ఆదేశించారు. మన తీరంలో మత్స్య సంపదపై మన మత్స్యకారులకే హక్కులున్నాయి. తీరం మనదే, బోటు మనదే, వేటా మనదే అనేలా చర్యలు చేపట్టాం. 200 మెకనైజ్డ్ బోట్లను మత్స్యకారులకు రూ.240 కోట్ల సబ్సీడీపై ఇవ్వాలని నిర్ణయించాం. దివ్యాంగ శక్తి పేరిట ఆర్టీసీ బస్సుల్లో దివ్యాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. గీత, వడ్డెర కార్మికులకు మద్యం దుకాణాలు, గనుల్లో రిజర్వేషన్లు కల్పించాం. ప్రజారోగ్యంలో సంజీవని ప్రాజెక్టుతో వినూత్న మార్పు తీసుకువచ్చాం. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో దీనిని అమలు చేస్తున్నాం. ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యక్తిగత ఆరోగ్య పర్యవేక్షణ కోసం డిజిటల్ హెల్త్ రికార్డుల కార్యక్రమం 'సంజీవని' అమలు చేస్తాం. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా అందరికీ ఆరోగ్య బీమాను కల్పిస్తున్నాం. విద్యారంగంలో ఏపీని రోల్ మోడల్‌గా నిలుపుతున్నాం. పేరెంట్ టీచర్స్ మీటింగ్, పాఠ్యాంశాల్లో మార్పులు వంటివి చేపట్టాం. అలాగే రాష్ట్రంలో ఎంతో కీలకమైన సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సంకల్పించాం. 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను ఎప్పుటికల్లా పూర్తి చేయాలి, ఎప్పుడు పూర్తి చేయాలనేదానిపై క్యాలండర్ ప్రకటించాం. పోలవరం ప్రాజెక్టును పుష్కరాలకంటే ముందే పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. గత పాలకుల నిర్లక్ష్యంతో డయాఫ్రమ్ వాల్ ధ్వంసమైంది. రూ. 1,000 కోట్లతో మళ్లీ నిర్మించాం. హంద్రీనీవా కాలువ వెడలు చేయడం ద్వారా కుప్పం వరకూ నీళ్లు తీసుకెళ్లాం. గత ప్రభుత్వం కుప్పం బ్రాంచ్ కెనాల్‌లో సినిమా సెట్టింగులు వేసి ట్యాంకర్‌తో నీళ్లు ఇచ్చి రైతుల్ని మోసం చేసింది. వెలిగొండ ఫేజ్ వన్ కూడా పూర్తి చేసి మార్కాపురం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం. రాష్ట్రంలో చెరువులు, రిజర్వాయర్లు జలకళతో కళకళ లాడుతున్నాయి. జలధార-జలహారతి ద్వారా భూగర్భజలాలను పెంచేలా వంద రోజుల కార్యక్రమం నిర్వహిస్తున్నాం.' అని ముఖ్యమంత్రి చెప్పారు.

**వైసీపీకి రాజధానిపై విజన్ లేదు..విషం కక్కడమే తెలుసు**

'రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి సంపద సృష్టించలేని వారికి సంక్షేమం గురించి మాట్లాడే అర్హత లేదు. వైసీపీకి రాజధానిపై ఓ విజన్ లేదు. విషం కక్కడమే తెలుసు. ప్రతిపక్షంలో అమరావతికి మద్దతన్నారు. అధికారపక్షంలో మూడు రాజధానులు అన్నారు. ఇప్పుడు ప్రతిపక్ష హోదా కూడా పోయాక మావిగన్ అంటున్నారు. వీళ్లను ఏమననాలో తెలీటం లేదు. పార్లమెంటులో చట్టం చేసినా మావిగన్ అంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. వాళ్లకు గోల్ అంటూ లేదు.... వాళ్లదో అడ్డగోలు బ్యాచ్. విశాఖలో రైల్వే జోన్ కోసం 52 ఎకరాల భూమిని కూడా గత ప్రభుత్వం ఇవ్వలేకపోయింది. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే విశాఖ రైల్వే జోన్ సాధించాం. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను తిరిగి నిలబెట్టాం, లాభాల బాట పట్టించాం. వైసీపీ ఓ బ్లఫ్ బ్యాచ్ -- ఫేక్ న్యూస్ బ్యాచ్. వాళ్లు గుంతలు పెట్టి వదిలి పోయిన రోడ్లను, మన ప్రభుత్వంలో మరమ్మత్తులు చేయటంతో పాటు కొత్త రోడ్లను నిర్మిస్తున్నాం. గత పాలకులు రూ.32 వేల కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేశారు. రూ.1.35 లక్షల కోట్ల మేర డిస్కమ్‌లను అప్పుల్లో ముంచారు. విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని చెప్పాం. తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే. గత పాలకులు 85 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలి వెళ్తే దానిని తొలగించాం. రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేస్తున్నాం. రికార్డులు సరిచేయడానికి 2 ఏళ్లు పట్టింది. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేశాం. నాలా యాక్టును కూడా రద్దు చేశాం. రాజముద్రతో ఇప్పుడు పట్టాదారు పాస్  పుస్తకాలను జారీ చేస్తున్నాం. రికార్డులు ట్యాంపర్ చేయకుండా చర్యలు చేపట్టాం. పశ్చిమాసియా యుద్ధ ప్రభావంతో గ్యాస్, ఇంధన కొరత వచ్చింది. ఆక్వా ధరలు పడిపోయాయి. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేలా చర్యలు చేపడుతున్నాం. మహానాడు ఓ పసుపు పండుగ, ప్రజలకు, కార్యకర్తలకు భరోసా ఇచ్చే ఓ వేదిక. గొడ్డలి పార్టీ డైవర్ట్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఎన్ని కుయుక్తులు పన్నినా టీడీపీని అడ్డుకోలేరు. పేదలకు కావాల్సింది సంక్షేమం... గొడ్డలివేట్లు కాదు. యువతకు కావాల్సింది ఉద్యోగాలు... కత్తి పోట్లు కాదు. రక్తాభిషేకాలు చేసే వారు స్వర్ణాంధ్ర చరిత్రను లిఖించలేరు. అందుకే గొడ్డలి పార్టీ నెవర్ అగైన్. వేట కొడవళ్ల నుంచి గొడ్డలి పార్టీగా మారటం వారి విధానం. ఐటీ నుంచి క్వాంటం దిశగా ఎదగటం మన విధానం... బోత్ ఆర్ నాట్ సేమ్.' అని సీఎం అన్నారు.

**క్రమశిక్షణ, కమిట్మెంట్‌తో కష్టపడే క్యాడర్**

'దేశంలో ఏ పార్టీకి లేని బలమైన కేడర్ మనకు ఉంది. క్రమశిక్షణ, కమిట్మెంట్‌తో కష్టపడే క్యాడర్ టీడీపీ సొంతం. మన బలం బలగం కేడర్. ఏదైనా పార్టీ ఫస్ట్, క్యాడర్ బెస్ట్. నాయకులను తయారు చేసే విశ్వవిద్యాలయం తెలుగు దేశం పార్టీ. ఇక్కడ చదువుకున్న, శిక్షణ పొందిన నాయకులే అన్ని చోట్లా రాణిస్తున్నారు. సోషల్ రీ ఇంజినీరింగ్ చేయటమే పార్టీ విధానం. అందరికీ అవకాశాలు కల్పించటమే పార్టీ లక్ష్యం. కార్యకర్తల సంక్షేమం కోసం రూ.160 కోట్లు ఖర్చు చేశాం. ఎడ్యుకేషన్, ఎంప్లాయిమెంట్ కోసం కూడా ఆదుకునేలా పార్టీ చర్యలు తీసుకుంటోంది. మై హెల్త్ యాప్ ద్వారా కార్యకర్తలు, వారి కుటుంబం ఆరోగ్యం కాపాడే బాధ్యత పార్టీ తీసుకుంది. ఎథికల్, ఎకనామికల్, ఎంపవర్‌మెంట్ నినాదంతో ముందుకు వెళ్తున్నాం. పార్టీ అధినేతగా నా పార్టీ కుటుంబ సభ్యులైన కార్యకర్తల ఎంపవర్మెంట్ కోసం నిరంతరం పనిచేస్తాం. స్థానిక ఎన్నికల కోసం సిద్ధం కావాలని అందరికీ పిలుపిస్తున్నా. ఏ ఎన్నికలైనా గెలుపే ప్రజాభిప్రాయానికి కొలమానం. గెలుపే ధ్యేయంగా నేతలు, కార్యకర్తలు పనిచేయాలి, ప్రజా సమస్యలు పరిష్కారం చేస్తూ ముందుకుసాగాలి. మనం చేసిన పని ప్రజలకు తెలియచేస్తూ వారిని ఆకట్టుకోవాలి. ఓటు నమోదు చేయించే కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనాలి. 'సర్'లో భాగంగా ఓట్ల నమోదు విషయంలో లీడర్లు, కేడర్ జాగ్రత్తగా ఉండాలి. మిత్ర పక్షాలతో సఖ్యతగా, సమన్వయంతో ముందుకు వెళ్దాం. 2024 ఎన్నికల్లో సాధించిన విజయం మళ్లీ రిపీట్ అయ్యేలా అందరం మమేకం అవుదాం. ఎవరూ ఇగోలకు వెళ్లొద్దని హితవు పలుకుతున్నాను. ప్రతీ నేతా జనంతో కార్యకర్తలతో మమేకం కావాలి. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ మన లక్ష్యం. మహానాడు సాక్షిగా తెలుగు జాతి కోసం పునరంకితం అవుదామని అందరికీ పిలుపునిస్తున్నాను. వచ్చిన అవకాశాలను నిలబెట్టుకోవాలని అందరికీ తెలియచేస్తున్నాను.' అని ముఖ్యమంత్రి తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

### ఓట్ల తొలగింపుపై

# వైసీపీ శ్రేణులను హెచ్చరించిన జగన్

అనుమానాలు వ్యక్తం చేశాయని జగన్ గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో 91 లక్షల ఓట్లు, తమిళనాడులో 94 లక్షల ఓట్లు తొలగించారని ఆయన గణాంకాలతో సహా వివరించారు. పశ్చిమ బెంగాల్‌లోని భబానీపూర్ నియోజకవర్గంలో 45,982 ఓట్లను తొలగించారని, అక్కడ మమతా బెనర్జీ 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారని తెలిపారు. అదేవిధంగా, తమిళనాడులోని కొళత్తూరు నియోజకవర్గంలో 71,000 ఓట్లను తొలగించగా, స్టాలిన్ 8,000 ఓట్లతో ఓటమి చవిచూశారని జగన్ విశ్లేషించారు. ప్రతి గ్రామంలో కొద్ది సంఖ్యలో నిజమైన ఓట్లను తొలగించినా, అది నియోజకవర్గ స్థాయి ఫలితాలను గణనీయంగా ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో, ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి సంబంధించిన దొంగ ఓట్లు, డూప్లికేట్ ఓట్లపై నిశితంగా దృష్టి సారించాలని పార్టీ శ్రేణులకు జగన్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గాన్ని ఉదాహరణగా చూపుతూ, అక్కడ ఓటర్ల జాబితాలో ఒకే పేరు, ఒకే కుటుంబ వివరాలతో వేలాది అనుమానాస్పద ఓట్లు ఉన్నాయని పేర్కొన్నారు.

# ప్రధాని మోదీతో విజయ్ భేటీ..

చర్చించినట్లు పేర్కొంది. తమిళనాడు మత్స్యకారులను శ్రీలంక నౌకాదళం అరెస్టు చేయడం, వేధించడం వంటి ఘటనలు పెరుగుతుండటంపై సీఎం ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపింది. ఈ ఏడాదిలోనే 12 అరెస్టులు నమోదయ్యాయని, ప్రస్తుతం 58 మంది మత్స్యకారులు శ్రీలంక నిర్బంధంలో ఉన్నారని ప్రధాని దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించింది. మత్స్యకారులను, వారి పడవలను తక్షణమే విడుదల చేయాలని శ్రీలంక ప్రభుత్వాన్ని కోరాల్సిందిగా అభ్యర్ధించినట్లు పేర్కొంది. అదేవిధంగా.. ప్రభుత్వ కార్యక్రమాల ప్రారంభంలో 'తమిళ్ తాయ్ వాళ్తు' (ప్రార్ధనా గీతం) ఆలపించడానికి అనుమతిస్తూ ఆదేశాలను జారీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపింది.

### గోదావరిలో కాలుష్య నివారణకు

# ప్రత్యేక టాస్క్‌ఫోర్స్

ఇంటిగ్రేటెడ్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలన్నారు. దీనికి అటవీ, పర్యావరణ శాఖ ముఖ్యకార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పురపాలక, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పరిశ్రమలు, దేవాదాయ శాఖ కమిషనర్లు, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ సీఈవో.. జలవనరులు, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ చీఫ్‌లు, మిషన్ క్లీన్ కృష్ణ-గోదావరి డైరెక్టర్.. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, పోలవరం జిల్లాల కలెక్టర్లు సభ్యులుగా ఉంటారు. అలానే కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీని సభ్య కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ టాస్క్‌ఫోర్స్ ప్రతి రెండు వారాలకోసారి సమావేశమై అప్పటివరకు గుర్తించిన కాలుష్య కారక ప్రాంతాలు, తీసుకున్న చర్యలపై సమీక్షించాలని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ నేతల ఘర్షణ

ఫిరోజ్‌ఖాన్, ఉస్మాన్ అల్ హజ్రీ బాహాబాహీకి దిగారు. ప్రొటోకాల్ విషయంలో వీరి మధ్య గొడవ జరిగింది. అజహరుద్దీన్ పక్కన కూర్చునే అంశంలో వివాదం చెలరేగింది. ఈ క్రమంలో ఉస్మాన్ అల్ హజ్రీ నెట్టివేయడంతో ఫిరోజ్‌ఖాన్ కిందపడిపోయారు. ఇద్దరి మధ్య ఘర్షణను అడ్డుకునేందుకు సీనియర్ నేత వీహెచ్ యత్నించారు. ఆయన్ను కూడా నెట్టివేసేలా వ్యవహరించడంతో నేతలు అడ్డుకున్నారు. ఈ పరిణామంతో మంత్రి అజహరుద్దీన్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశం ముగిసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు.

### ఏపీ కాంగ్రెస్ చీఫ్

# వైఎస్ షర్మిలకు రాజ్యసభ సీటు?

కేంద్ర స్థాయి నుంచి కాంగ్రెస్ అధికార ప్రతినిధులు పవన్ ఖేడా, సుప్రియా శ్రీనటేల పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. వీరితో పాటు వైఎస్ షర్మిల పేరు కూడా ఈ జాబితాలో చేరడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ కోటాలో ఇప్పటి వరకు వైఎస్సార్సీపీ రాజ్యసభ ఎంపీగా ప్రాతినిధ్యం వహించిన రిలయన్స్ ప్రతినిధి పరిమళ నత్వానీ పదవీకాలం ముగిసింది. దీంతో ఆయన మళ్లీ ఝార్ఖండ్ రాష్ట్రం నుంచి ఎగువసభకు ఎన్నికయ్యేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. గతంలో ఝార్ఖండ్ నుంచి రెండు పర్యాయాలు స్వతంత్ర అభ్యర్థిగా విజయం సాధించిన నత్వానీ, ఈ విడతలో మాత్రం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఇదే సమయంలో ఝార్ఖండ్‌లో ఖాళీ అయిన రెండు రాజ్యసభ స్థానాల్లో ఒకదానికి జేఎంఎం అధినేత కుటుంబం నుంచి ఒక మహిళా సభ్యురాలిని బరిలోకి దించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక్కడి రెండో స్థానాన్ని దక్కించుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఆశిస్తున్నప్పటికీ, ఆ పార్టీకి ఉన్న 16 మంది శాసనసభ్యుల బలం సరిపోవడం లేదు. ఝార్ఖండ్‌లో ఒక రాజ్యసభ సీటు గెలవాలంటే కనీసం 24 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం కావడంతో ఇక్కడ కాంగ్రెస్‌కు సాంకేతిక సమీకరణాలు ప్రతిబంధకంగా మారాయి.

# పాక్ మధ్యవర్తిత్వమే పెద్ద సమస్య

ఉన్నాయన్నారు. ఇజ్రాయెల్‌పై నమ్మకం లేనందున అబ్రహాం ఒప్పందంలో పాల్గొనేది లేదని ఖవాజా చేసిన వ్యాఖ్యలను లిండ్సే ప్రస్తావించారు. ఆ వ్యాఖ్యలు తనను భయాందోళనకు గురిచేశాయన్నారు. అబ్రహాం ఒప్పందాలపై సంతకాలు చేయాలంటూ ట్రంప్ ఇచ్చిన పిలుపుపై పాక్ వెంటనే సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఇటీవల అమెరికాతో ఘర్షణల నేపథ్యంలో ఇరాన్ తన సైనిక విమానాలను పాక్ ఎయిర్‌బేస్‌లలో పార్క్ చేసినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. దీన్ని లిండ్సే తన పోస్టులో ప్రస్తావిస్తూ.. ఈ విషయం అబద్ధమని కొట్టిపారేయలేమన్నారు.

# కడప జిల్లాలో 15 ఏళ్ల బాలికపై అత్యాచారం

మండలానికి చెందిన 15 ఏళ్ల బాలికకు, వల్లూరు మండలం కోట్లూరు గ్రామానికి చెందిన ఈశ్వర్ (19) అనే యువకుడితో సోషల్ మీడియాలో పరిచయం ఏర్పడింది. ప్రేమ పేరుతో బాలికను మభ్యపెట్టిన నిందితుడు, ఆమెను తన మోటార్‌సైకిల్‌పై ఖాజీపేటలోని ఓ లాడ్జికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ దాడిలో బాలికకు తీవ్ర రక్తస్రావం అయినప్పటికీ, నిందితుడు కనికరించలేదు. అనంతరం బాలికను ఆమె ఇంటి సమీపంలో వదిలిపెట్టి ఈశ్వర్ పరారయ్యాడు. తీవ్ర రక్తస్రావంతో బాధపడుతూ ఇంటికి చేరుకున్న కుమార్తెను చూసి కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే ఆమెను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి, ఆపై మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. మంగళవారం బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దువ్వూరు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడు ఈశ్వర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు.

# భారత అంతరిక్ష పరిశ్రమ

నానోకాంపోజిట్‌తో తయారుచేసిన దీనిని హైడ్రోజన్‌తో నింపారు. నావిగేషన్ కోసం గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్ మాడ్యూల్‌ను అమర్చారు. 50 కిలోల వరకు పేలోడ్‌ను మోయగల సామర్థ్యం ఉన్న ఈ బెలూన్‌లో ఇతర సెన్సార్లతో పాటు ఆరు పేలోడ్‌లను ఉంచి ప్రయోగించారు. ఈ ప్రయోగంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు ఇదో మైలురాయి అని ప్రశంసించారు. టవర్లు లేని గ్రామాలు, గిరిజన, తీర ప్రాంతాల్లోనూ ఈ సాంకేతికత కనెక్టివిటీని విస్తరించగలదని పేర్కొన్నారు. ప్రధాని మోదీ ప్రోత్సాహంతో భారత స్పేస్ పరిశ్రమ ద్వారా ప్రస్తుతం 8 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరుగుతోందన్నారు. రాబోయే పదేళ్లలో ఇది 40 బిలియన్ డాలర్ల (సుమారు రూ.4 లక్షల కోట్లు)కు చేరుకొనే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**ఏమిటీ సూపర్ ప్రెజర్ బెలూన్..**

సూపర్ ప్రెజర్ బెలూన్ అనేది అధిక ఎత్తులో (స్ట్రాటోస్పియర్) శాస్త్రీయ పరిశోధనలు, టెలీకమ్యూనికేషన్ల కోసం ఉపయోగించే ఒక ప్రత్యేకమైన బెలూన్. బయటి వాతావరణంతో సంబంధం లేకుండా.. లోపల ఉండే హైడ్రోజన్ ద్వారా ఇవి చాలా రోజుల పాటు గాల్లో తేలుతూ ఉంటాయి. గ్రామీణ ప్రాంతాలకు ఇంటర్నెట్, కమ్యూనికేషన్ సేవలను అందించడానికి, అంతరిక్ష పరిశోధనలకు ఇవి ఎంతో ఉపయోగపడతాయి. వందల కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న పారిశ్రామిక కారిడార్ల పర్యవేక్షణకు కూడా వీటిని వినియోగిస్తారు.

# వాసుదేవరెడ్డిని విచారిస్తున్న ఈడీ

రూపకల్పన, అమలులో ఆయన ప్రధాన పాత్ర పోషించారని ఇప్పటికే సిట్ తేల్చిన విషయం తెలిసిందే. 2019 కంటే ముందువరకూ ఆటోమేటెడ్ విధానంలో ఉన్న మద్యం సరఫరా ఆర్డర్ల జారీ వ్యవస్థను విధ్వంసం చేసి, ఆ స్థానంలో మాన్యువల్ విధానాన్ని ప్రవేశపెట్టటం ద్వారా కుంభకోణానికి దారులు తెరిచారని వెల్లడించింది.

# 'మహానాడు'ను 'దగానాడు'గా అభివర్ణించిన రోజా

పదోన్నతిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. టీడీపీ నిర్వహిస్తున్న మహానాడును 'దగానాడు'గా అభివర్ణించిన రోజా... వైసీపీ నేతలను అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో జగన్ చేసిన అభివృద్ధి పనులను తమ ఖాతాలో వేసుకుంటూ క్రెడిట్ చోరీ చేస్తున్నారని మండిపడ్డారు. ఈ రెండేళ్ల కాలంలో కూటమి ప్రభుత్వం సొంతంగా ప్రారంభించి పూర్తి చేసిన ఒక్క పనినైనా చూపించగలదా అని ప్రశ్నించారు. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన 'సూపర్ సిక్స్' పథకాలు ఏమయ్యాయని, అవి సూపర్ హిట్ ఎలా అయ్యాయో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నారా లోకేశ్ విద్యాశాఖ మంత్రి కాగానే రాష్ట్రంలో విద్యా వ్యవస్థ కుంటుపడిందని విమర్శించిన రోజా... మంత్రిగానే సరిగ్గా పని చేయని లోకేశ్‌ను ఇప్పుడు ఏకంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎలా చేశారని నిలదీశారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రశ్నిస్తానన్న నాయకుడు (పవన్ కల్యాణ్) ఇప్పుడు ఎక్కడ ఉన్నారో, ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. మహానాడులో లోకేశ్ ప్రకటించిన 33 శాతం మహిళా రిజర్వేషన్లపై స్పందిస్తూ.. గతంలో అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు ఇవ్వలేదని, ఇప్పుడే ఎందుకు అన్నీ గుర్తుకు వస్తున్నాయని ప్రశ్నించారు. కూటమి మోసాలను ఎండగట్టేందుకు జూన్ 4 నుంచి వైసీపీ ప్రజల్లోకి వెళుతుందని రోజా స్పష్టం చేశారు.

# ఎడిటర్ వాయిస్

మిషన్ క్లీన్ గోదావరి - కాలుష్యం నుంచి రక్షణకు ప్రత్యేక టాస్క్ ఫోర్స్..

## పవన్ సంచలన నిర్ణయం

గోదావరి నది దుస్థితిపై తీవ్రంగా చలించిపోయిన పవన్ కళ్యాణ్, రాజమండ్రిలోనే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, తక్షణమే అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభం కానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకుని ఏపీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. పవిత్ర గోదావరి నదితోపాటు రాష్ట్రంలోని ప్రధాన నదులను కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు అత్యున్నత స్థాయి 'ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ టాస్క్ ఫోర్స్' ఏర్పాటు చేస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఉప ముఖ్యమంత్రి, పర్యావరణ, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాలతో మంగళవారం రాత్రి ఈ ఆదేశాలు వెలువడ్డాయని చెబుతున్నారు. రాజమహేంద్రవరం పర్యటనలో గోదావరి కాలుష్యాన్ని ప్రత్యక్షంగా చూసిన ఉప ముఖ్యమంత్రి పవన్ చలించిపోయారు. ఏడాదిలో పుష్కరాలు జరుగుతుండగా, నదిలో కలుషిత జలాలు కలపకుండా ఆపలేకపోతున్నారని అధికారులపై డిప్యూటీ సీఎం సీరియస్ అయ్యారు. దీంతో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటుకు ఆదేశాలిచ్చారని చెబుతున్నారు.

రెండు రోజుల పాటు గోదావరి పరివాహక ప్రాంతంలో విస్తృతంగా పర్యటించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గోదావరి మధ్యలో ఉన్న నల్లా ఛానల్, ఆంధ్ర పేపర్ మిల్స్ పరిశ్రమల పరిసర ప్రాంతాలను నిశితంగా పరిశీలించారు. పరిశ్రమల నుంచి వస్తున్న ప్రమాదకర రసాయన వ్యర్థాలు, నగరంలోని మురుగునీటిని శుద్ధి చేయకుండా నేరుగా పవిత్ర గోదావరిలో కలపడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తులు తాము మురుగు నీటిలో స్నానం చేస్తున్నామనే భావనతో వెళ్లకూడదు. ప్రతి ఒక్కరికీ పవిత్రమైన, స్వచ్ఛమైన గోదావరి జలాల్లో స్నానం చేస్తున్నామనే అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతి కలగాలి' అనే అభిప్రాయంతో నదీ కాలుష్యం నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

గోదావరి నది దుస్థితిపై తీవ్రంగా చలించిపోయిన పవన్ కళ్యాణ్, రాజమండ్రిలోనే ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి, తక్షణమే అంతర్ జిల్లా టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ అత్యున్నత స్థాయి కమిటీకి పర్యావరణ, అటవీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ చైర్మన్‌గా వ్యవహరించనుండగా, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి మెంబర్ సెక్రటరీ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారు. కమిటీలో ఇతర కీలక సభ్యులుగా పురపాలక పరిపాలన శాఖ కమిషనర్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్, పరిశ్రమలు, వ్యవసాయం, మత్స్య శాఖల కమిషనర్లు ఉంటారు. అదేవిధంగా రాష్ట్ర టూరిజం అథారిటీ సీఈఓ, దేవాదాయ శాఖ కమిషనర్, జలవనరుల శాఖ ఈఎన్‌సీ, గ్రామీణ నీటి సరఫరా ఈఎన్‌సీ, క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్ మిషన్ డైరెక్టర్ సభ్యులుగా ఉంటారు. గోదావరి పరివాహక జిల్లాలైన తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కాకినాడ, కోనసీమ, పోలవరం జిల్లాల కలెక్టర్లు కూడా ఇందులో సభ్యులుగా వ్యవహరిస్తారు. సీనియర్ ఐఏఎస్ అధికారులతో ఏర్పాటైన ఈ టాస్క్ ఫోర్స్ తో గోదావరికి కొత్త కళ తీసుకురావాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కృతనిశ్చయంతో ఉన్నారని అంటున్నారు.

### ప్రతి 15 రోజులకు సమీక్ష

ఇక ప్రత్యేక టాస్క్ ఫోర్స్ కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కఠినంగా వ్యవహరించేలా విధులను ఖరారు చేశారు. 15 రోజులకు ఒకసారి కమిటీ తప్పనిసరిగా సమావేశమై పనుల ప్రగతిని సమీక్షించాలని సూచించారు. గోదావరితో పాటు ఇతర నదుల్లోకి కాలుష్యం ఎక్కడెక్కడ నుంచి చేరుతుందో క్షేత్రస్థాయిలో గుర్తించాలని దిశానిర్దేశం చేశారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సూచనల ప్రకారం మురుగునీరు, పారిశ్రామిక వ్యర్థాలు నదిలో కలవకుండా శాశ్వత పర్యావరణ రక్షణ చర్యలను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల నాటికి భక్తులకు స్వచ్ఛమైన, పవిత్రమైన నదీ జలాలను అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన అడుగులు వేస్తోందని తాజా నిర్ణయాల ఆధారంగా విశ్లేషిస్తున్నారు.



ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## అప్పుల భారం.. భార్య, ఇద్దరు పిల్లలను చంపి, యజమాని ఆత్మహత్య



**వనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** మామిడి తోటలు కౌలుకు తీసుకున్న ఓ కౌలు రైతు సరైన దిగుబడులు రాక అప్పులపాలయ్యాడు. చేసిన అప్పులు తీర్చడానికి ప్రైవేటు బ్యాంకులో ఇంటిని తనఖా పెట్టాడు. రెండు నెలలుగా వాయిదాలు చెల్లించకపోవడంతో ప్రైవేటు రుణ సంస్థ నుంచి ఒత్తిడి ఎక్కువైంది. వారి వేధింపులు తట్టుకోలేక భార్య, కుమారుడు, కుమార్తెను తాళ్లతో కట్టేసి మామిడి తోటలో ఉన్న నీటి సంపులో పడేశాడు. అనంతరం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన వనపర్తి జిల్లాలో కలకలం రేపింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం డోకూర్‌కు చెందిన నరసింహ.. వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలం సల్కెలాపురంలో మామిడి తోట కౌలుకు తీసుకొని అక్కడే నివాసం ఉంటున్నాడు. "ఇంటిపై తీసుకున్న రుణం కిస్తీలు చెల్లించాలని ఒత్తిడి చేసి, మానసికంగా నన్ను ఇబ్బందులకు గురి చేశారు. అప్పులు తీర్చేందుకు సమయం కావాలని న్యాయవాది వద్దకు వెళితే.. ఐపీ పెట్టడానికి వెళ్లానని నన్ను దూషించారు. నాకు జరిగిన అన్యాయం ఎవరికీ జరగకూడదనే.. నా పిల్లల్ని, భార్యను చంపి నేను కూడా చనిపోతున్నా. ఇప్పుడు అందరి కళ్లు చల్లబడ్డాయా. మామిడి తోట శ్రీనివాసరావు, సాయి సార్, గణేష్ సార్.. నేను మిమ్మల్ని ఎప్పుడూ మోసం చేయలేదు. హోమ్ లోన్ వాళ్లు మనుషులను ఇబ్బందులకు గురి చేయొద్దు. అప్పు ఉన్నాడంటూ ఇంటి గోడపై రాయించి ఇంటిని సీజ్ చేశారు. ఇంట్లో ఉన్న వెండి, బంగారు ఆభరణాలు తీసుకెళ్లారు. అప్పు తీసుకున్న వాళ్లను అర్థం చేసుకోండి" అంటూ సెల్ఫీ వీడియో తీసుకొని నరసింహ ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు రూ.30 లక్షలు డిమాండ్

### అనిశాకు చిక్కిన శామీర్‌పేట తహసీల్దార్ - ప్రైవేటు డ్రైవర్, తహసీల్దార్ అరెస్టు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రైవేటు డ్రైవర్ ద్వారా లంచం తీసుకుంటూ శామీర్‌పేట తహసీల్దార్ టి.సుచరిత అనిశాకు చిక్కారు. స్థానిక రైతులకు చెందిన 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చేందుకు ఆమె రూ.30 లక్షలు డిమాండ్ చేశారు. తొలివిడత కింద రూ.2 లక్షల సొమ్మును ప్రైవేటు డ్రైవర్ ద్వారా తీసుకుంటుండగా పట్టుబడ్డారు. అనిశా డీఎస్పీ ఆనంద్ మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం అలియాబాద్‌లోని వివిధ సర్వే నంబర్లలోని 30 ఎకరాలను వ్యవసాయేతర భూమిగా మార్చాలంటూ కొందరు రైతులు తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ పనికి వారు ఓ కన్సల్టెన్సీ ద్వారా సంప్రదించగా.. ఎకరాకు రూ.లక్ష చొప్పున లంచం ఇవ్వాలని తహసీల్దార్ సుచరిత మెలిక పెట్టారు. అంత మొత్తం ఇచ్చుకోలేమని రైతులు చెప్పినా పట్టించుకోలేదు. విసిగిపోయిన రైతులు అనిశాను ఆశ్రయించారు. అనిశా సూచనల ప్రకారం.. తొలుత రూ.2 లక్షలు ఇస్తామని తహసీల్దార్‌కు చెప్పారు. మంగళవారం లంచం డబ్బు ఇచ్చేందుకు వెళ్లగా తన ప్రైవేటు డ్రైవర్ వి.నగేశ్‌కు ఇవ్వాలని సూచించారు. రైతులు డబ్బు ఇస్తుండగా.. అప్పటికే వల పన్నిన అనిశా అధికారులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా తహసీల్దార్ సూచనతోనే డబ్బు తీసుకున్నట్లు తెలిపాడు. ఇద్దరినీ అధికారులు అరెస్టు చేశారు.

**ఆర్డీవోను పిలిపించి విచారణ..**

అనిశా అధికారులు కార్యాలయంలో భూ అనుమతులకు సంబంధించిన రికార్డులు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. కొందరు సిబ్బందిని విచారించారు. అనంతరం కీసర ఆర్డీవో రాజేశ్‌ను అప్పటికప్పుడు శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించడం చర్చనీయాంశమైంది. ఆయన నుంచి కొన్ని వివరాలు రాబట్టారు. తహసీల్దార్‌కు చెందిన ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

**గతంలోనూ ఆరోపణలు..:** తహసీల్దార్ సుచరితపై గతంలో పనిచేసిన ప్రాంతాల్లోనూ తీవ్ర ఆరోపణలు వచ్చాయి. కాప్రా తహసీల్దార్‌గా పనిచేసిన సమయంలో కుషాయిగూడ, జవహర్‌నగర్ పరిధిలోని అనేక భూవివాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్ చేసినట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఓ జిల్లాలో పనిచేసినప్పుడు ఆమెపై తీవ్ర ఆరోపణలతో కలెక్టరేట్‌కు బదిలీ చేశారు. తర్వాత కొద్దిరోజులకే మళ్లీ పోస్టింగ్ తెప్పించుకోవడమూ చర్చనీయాంశమైంది. రెండేళ్లక్రితం అప్పటి శామీర్‌పేట తహసీల్దార్ సత్యనారాయణ సైతం అనిశాకు చిక్కడం గమనార్హం. అప్పట్లోనూ డ్రైవర్ ద్వారా రూ.10 లక్షల లంచం తీసుకుంటూ దొరికిపోయారు.

## అనిశా వలలో వడ్డేపల్లి సర్వేయర్



**శాంతినగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండల సర్వేయర్ బ్రహ్మయ్య అనిశాకు చిక్కారు. అనిశా డీఎస్పీ బాలకృష్ణ కథనం ప్రకారం.. కొంకల గ్రామానికి చెందిన రైతు తన 4.5 ఎకరాల పొలం సర్వే చేయాలని బ్రహ్మయ్యను అడిగారు. దానికి రూ.20 వేలు డిమాండ్ చేశారు. రైతు రూ.15 వేలకు మాట్లాడుకుని రెండ్రోజుల క్రితం రూ.5 వేలు ఇచ్చారు. మిగిలిన రూ.10 వేలు మంగళవారం రైతు నుంచి తీసుకుంటుండగా సర్వేయర్‌ను పట్టుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. బ్రహ్మయ్యను ఏసీబీ కోర్టుకు తరలించనున్నట్లు వివరించారు.

## చిరంజీవిపై మార్ఫింగ్ వీడియోలు..

### యూట్యూబ్ ఛానెల్‌పై కేసు



**ఫిల్మ్‌నగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** సినీ నటుడు చిరంజీవి ఆరోగ్యంపై అసత్య ప్రచారం చేస్తూ మార్ఫింగ్ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ చేసిన యూట్యూబ్ ఛానెల్‌పై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. చిరంజీవి గురించి తప్పుడు వీడియోలు, ఫొటోలు ఓ యూట్యూబ్ ఛానెల్ వైరల్ చేసిందని కమలాపురి కాలనీకి చెందిన న్యాయవాది రామకృష్ణ మిర్యాల జూబ్లీహిల్స్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. నటుడి ప్రతిష్ఠకు భంగం కలిగేలా కంటెంట్‌ను వైరల్ చేశారని తెలిపారు. సంబంధిత వీడియోల స్క్రీన్ షాట్లు, వీడియోలను పోలీసులకు అందజేశారు. కోర్టు అనుమతి అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## హయత్‌నగర్ వద్ద రోడ్డు ప్రమాదం..

### వాహనాల రాకపోకలకు అంతరాయం



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ సమీపంలో విజయవాడ జాతీయ రహదారిపై తెల్లవారు జామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న కంటైనర్ లారీని వెనుక నుంచి టిప్పర్ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో చిన్నరావిర్యాల గ్రామానికి చెందిన టిప్పర్ డ్రైవర్ సంపంగి నవీన్.. క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, అంబులెన్స్ సిబ్బంది గంటపాటు శ్రమించి కట్టర్ల సాయంతో నవీన్‌ను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన అతడిని సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాద ఘటనతో హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. దీంతో సర్వీస్ రోడ్డులోకి వాహనాలను మళ్లించారు.

## బంగారం కోసం పెద్దమ్మనే చంపేసింది

**అనకాపల్లి పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** అనకాపల్లి జిల్లా కశింకోటలో దారుణం చోటుచేసుకుంది. బంగారం కోసం ఓ మహిళ పెద్దమ్మనే చంపేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కశింకోటలో నివాసముంటున్న వృద్ధురాలు దమ్ము నాగమ్మ (85) ఈనెల 16న మృతిచెందింది. సీఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 16న రాత్రి నాగమ్మ ఇంటికి ఆమె సోదరి కుమార్తె సిమ్మ సత్య వచ్చింది. ఆమెకు అప్పుల బాధ ఎక్కువగా ఉంది. దీంతో వాటిని తీర్చేందుకు ఇంట్లో ఒంటరిగా ఉంటున్న పెద్దమ్మ నాగమ్మను బంగారు వస్తువులు తాకట్టు పెట్టుకునేందుకు అడిగింది. దీనికి ఆమె నిరాకరించడంతో చున్నీతో గొంతు నులిమి హత్య చేసింది. మరుసటి రోజు ఇంటికి వచ్చి బంగారు వస్తువులు కాజేసింది. ఈ ఘటనలో ఎవరికీ అనుమానం రాకుండా సత్య వ్యవహరించింది. చివరికి పోలీసుల విచారణలో తానే హత్య చేసినట్లు ఒప్పుకోవడంతో ఆమెను అరెస్ట్ చేశారు. నాగమ్మ ఇంట్లో కాజేసిన బంగారు వస్తువులను నిందితురాలి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

## శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం..

### నీటికుంటలో పడి ముగ్గురు బాలురు మృతి

**పెనుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీసత్యసాయి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. నీటికుంటలో పడి ముగ్గురు బాలురు మృతిచెందారు. రొద్దం మండలం నారనాగేపల్లిలో ఈ ఘటన జరిగింది. పొలంలో నల్లనేరేడు పండ్ల కోసం వెళ్లి ముగ్గురూ ప్రమాదవశాత్తు నీటికుంటలో పడ్డారు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతులను దరహాస్‌రెడ్డి (13), హర్షిత్‌రెడ్డి (10), సృజన్‌రెడ్డి (13)గా గుర్తించారు. వీరిలో దరహాస్, హర్షిత్ అన్నదమ్ములు. వారి తండ్రి అజయ్‌రెడ్డి ఆర్మీ జవాన్. ప్రస్తుతం ఆయన మణిపూర్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. స్థానికుల సహాయంతో మృతదేహాలను పోలీసులు వెలికితీశారు. బాలుర మృతితో వారి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

# అసలు ఈ స్కూల్‌ని ఎవరయ్యా కనిపెట్టేంది?




చిన్నప్పుడు స్కూల్ బెంచ్ మీద కూర్చుని, క్లాస్ వినలేక బోర్ కొడుతున్నప్పుడు ప్రతి ఒక్కరికీ ఒక డౌట్ కచ్చితంగా వచ్చే ఉంటుంది.. "అసలు ఈ స్కూల్ అనే దాన్ని ఎవరు కనిపెట్టారురా బాబూ?" అని. అయితే, దీనికి ఒక సింగిల్ ఆన్సర్ గానీ, ఒక డేట్ గానీ లేదు. ఇది మనిషిలో ఉన్న క్యూరియాసిటీ వల్ల కొన్ని వేల ఏళ్ల నుంచి జరుగుతున్న ఓ పెద్ద ప్రయాణం. అడవుల్లో క్యాంప్ ఫైర్ దగ్గర మొదలై.. మోడ్రన్ క్లాస్ రూమ్స్ వరకు సాగిన ఈ ఇంట్రెస్టింగ్ హిస్టరీ ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం.అసలు 'ఫార్మల్ స్కూల్' అనేది మోడ్రన్ ఐడియా. హిస్టరీలో చాలా కాలం పాటు చదువుకోవడానికి స్కూల్ బిల్డింగ్స్ అంటూ ఏమీ ఉండేవి కావు. పిల్లలు చదువును తమ డైలీ లైఫ్‌లో భాగంగా నేర్చుకునేవారు. వ్యవసాయం చేసే వాళ్ల పిల్లలు.. రుతువులను బట్టి పంటలు ఎలా పండించాలో పొలంలోనే నేర్చుకునేవారు. కుండలు, వడ్రంగి పని చేసే వాళ్ల పిల్లలు.. పెద్దవాళ్లకు సాయం చేస్తూ ఆ స్కిల్స్ నేర్చుకునేవాళ్లు. అప్పట్లో నాలెడ్జ్ అనేది కథలు, పాటల రూపంలో ఒకరి నుంచి ఒకరికి పాస్ అయ్యేది. అప్పట్లో టెక్స్ట్ బుక్స్, హోంవర్క్ అనే టార్చర్స్ లేవు.. అంతా ప్రాక్టికల్ ఎక్స్‌పీరియన్సే. మొట్టమొదటి ఫార్మల్ స్కూల్స్సమాజం డెవలప్ అయ్యేకొద్దీ, చదువుకి ఒక పద్ధతి అవసరమై ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రాచీన నాగరికతల్లో తొలి తరం స్కూల్స్ పుట్టుకొచ్చాయి. మన ఇండియాలో గురుకుల వ్యవస్థ ఉండేది.. స్టూడెంట్స్ గురువుగారి ఆశ్రమంలో ఉంటూ యుద్ధ విద్యల నుంచి ఫిలాసఫీ వరకు అన్నీ ప్రకృతి ఒడిలోనే నేర్చుకునేవారు. అలాగే మెసొపొటేమియాలో రికార్డ్స్ మెయింటైన్ చేయడం కోసం 'ఎడుబ్బాస్' (లేదా 'టాబ్లెట్ హౌసెస్' ఉండేవి, అక్కడ మట్టి పలకల మీద క్యూనిఫామ్ అనే కష్టమైన రాతను నేర్పించేవారు. ఈజిప్ట్‌లో కూడా గుడి, గవర్నమెంట్ పనుల కోసం హైరోగ్లిఫిక్స్ (చిత్ర లిపి) నేర్పించే స్కూల్స్ నడిచేవి. ఐతే ఇక్కడో విషయం గుర్తుపెట్టుకోవాలి.. ఈ స్కూల్స్ అందరి కోసం కాదు, కేవలం కొంతమంది ఉన్నత వర్గాల పిల్లలకు, స్పెషల్ జాబ్స్ చేసేవారికే ఈ ట్రైనింగ్ పరిమితం అయ్యేది. గ్రీకులతో వచ్చిన అసలైన మార్పుఏన్షియంట్ గ్రీస్ సమయంలో ఎడ్యుకేషన్ మొత్తం మారిపోయింది. సోక్రటీస్, ప్లాటో, అరిస్టాటిల్ లాంటి మేధావులు ఎడ్యుకేషన్ అంటే కేవలం బట్టీ పట్టడం కాదు, 'ఆలోచించడం' అని చెప్పారు. క్రీస్తు పూర్వం 387లో ప్లాటో 'ది అకాడమీ'ని స్టార్ట్ చేశాడు. ఇది జాబ్స్ కోసం పెట్టే ట్రైనింగ్ సెంటర్ కాదు.. డిబేట్లు పెట్టడం, లాజిక్‌తో ఆలోచించడం, ప్రకృతి గురించి ప్రశ్నలు అడగడం ఇక్కడ నేర్పించేవారు. చదువు అంటే మైండ్ డెవలప్ చేసుకోవడం అనే కాన్సెప్ట్ ఇక్కడి నుంచే వచ్చింది. మనం చూస్తున్న స్కూల్ సిస్టమ్ ఎవరి ఐడియా?మరి ఇప్పుడు మనం చూస్తున్న.. బెంచీలు, టైమ్ టేబుల్స్ ఉండే స్కూల్ సిస్టమ్‌ని డిజైన్ చేసింది ఎవరు? దీనికి మేజర్ క్రెడిట్ ఇవ్వాల్సింది హొరేస్ మన్ అనే వ్యక్తికి. అతన్ని ఎడ్యుకేషన్ హిస్టరీలో ఓ గేమ్‌చేంజర్ అనొచ్చు. 1830ల సమయంలో అమెరికాలో హొరేస్ 'కామన్ స్కూల్స్' అనే కాన్సెప్ట్ తెచ్చాడు. పేద, ధనిక తేడా లేకుండా పిల్లలందరికీ పబ్లిక్ ఫండ్స్‌తో ఒకే రకమైన బేసిక్ ఎడ్యుకేషన్ దొరకాలని వాదించాడు. వయసును బట్టి క్లాసులు డివైడ్ చేయడం, కోర్ సబ్జెక్ట్స్ సిలబస్, ప్రొఫెషనల్ టీచర్స్, ఒక పద్ధతి ప్రకారం నడిచే టైమ్ టేబుల్స్.. ఇవన్నీ హొరేస్ మన్ పాపులర్ చేసినవే. ఈ మోడల్ హిట్ అయ్యి ప్రపంచమంతా పాకింది. మారుతున్న క్లాస్ రూమ్స్కాలం మారుతున్న కొద్దీ స్కూల్స్ కూడా అప్‌డేట్ అవుతూనే ఉన్నాయి. ఒకప్పుడు పలకల నుంచి ప్రింటెడ్ టెక్స్ట్ బుక్స్‌కి మారాం. తర్వాత బ్లాక్ బోర్డులు, ఇప్పుడు స్మార్ట్ బోర్డులు.. చేతిలో డిజిటల్ స్క్రీన్స్ వచ్చేశాయి. ఇప్పుడు లెర్నింగ్ అనేది క్లాస్ రూమ్ గోడలు దాటి ఆన్‌లైన్ క్లాసుల వరకు వచ్చేసింది. టెక్నాలజీ ఎంత మారుతున్నా స్కూల్ అసలు ఉద్దేశం మాత్రం ఒక్కటే.. పిల్లలకి నాలెడ్జ్ ఇవ్వడం, సొంతంగా ఆలోచించేలా చేయడం, మంచి పౌరులుగా తీర్చిదిద్దడం. గురుకులాల నుంచి గూగుల్ క్లాస్ రూమ్స్ వరకు.. ఆ గైడింగ్ ప్రిన్సిపల్ మాత్రం ఎప్పటికీ మారదు.

## మహానాడు తీర్మానాలు

# రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తాయి

**డిజిటల్ మహానాడుతో టీడీపీకి నూతన దిశ - కార్యకర్తలే పార్టీకి అసలైన బలం**

**కార్యకర్తల సంక్షేమానికే ప్రాధాన్యత - సాంకేతికతతో పార్టీని మరింత బలోపేతం చేస్తున్న టీడీపీ**

**తెలుగు జాతి గౌరవమే పార్టీ లక్ష్యం - ఎన్టీఆర్ ఆశయాలతో ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ**

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ - పండుగ వాతావరణంలో డిజిటల్ మహానాడు**





**రాజమహేంద్రవరం, నేటివార్త :** ఈ డిజిటల్ మహా నాడులో రాష్ట్ర అభివృద్ధి, పరిశ్రమలు, ఉద్యోగాలు, యువత భవిష్యత్తు, సంక్షేమం, సాంకేతికత, పార్టీ సంస్థాగత బలోపేతం వంటి అంశాలపై కీలక తీర్మానాలు ప్రవేశపెట్టను న్నట్లు రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి... తెలుగు వారు గర్వంగా జీవించాలి... అదే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొ న్నారు. రాష్ట్ర శ్రేయస్సు, తెలుగు ప్రజల భవిష్యత్తు కోసం టీడీపీ ఎప్పటికప్పుడు కృషి చేస్తుందని స్పష్టం చేశారు. తెలుగుదేశం పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "డిజిటల్ మహానాడు - 2026" కార్యక్రమం రాజమహేంద్ర వరం సిటీ నియోజకవర్గంలో మొదటి రోజు బుధవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగింది. నగర టీడీపీ ఆధ్వర్యంలో, రాజమహేం ద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సారథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ ఎత్తున డిజిటల్ మహా నాడు నిర్వహించారు. పార్టీ శ్రేణులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కమిటీ సభ్యులు, కుటుంబ సాధికార సారథులు, వార్డ్ కమిటీలు, కార్పొరేషన్ డైరెక్టర్లు, ఎండోమెంట్స్ కమిటీ సభ్యులు, యువత,మహిళలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానాడును విజయవంతం చేశారు.

**కార్యకర్తలకు మహానాడు ఒక పండుగ**

క్వారీ ఏరియాలోని బి ఎన్ ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మహానాడు అనేది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు ఒక భావోద్వేగ పండుగ అని పేర్కొన్నారు. పసుపు సైనికులు ప్రతి ఏడాది ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే వేడుక మహానాడని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కొన్ని పరిస్థితుల దృష్ట్యా ఈసారి మహానాడును డిజిటల్ విధానంలో నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నాయకత్వంలో మొట్టమొదటిసారిగా జరుగుతున్న ఈ మహానాడు చరిత్రాత్మకమని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది క్లస్టర్లను యూనిట్లుగా తీసుకుని గ్రామ స్థాయి నుండి పార్టీ నిర్మాణాన్ని మరింత పటిష్టం చేసే దిశగా కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు.

**క్లస్టర్ - క్యూబ్ వ్యవస్థతో క్షేత్రస్థాయిలో అద్భుత ఫలితాలు**

టీడీపీ చేపట్టిన క్లస్టర్, క్యూబ్ వ్యవస్థల వల్ల క్షేత్రస్థాయిలో నాయకత్వం మరింత బలపడుతోందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు. పార్టీ నిర్మాణాన్ని బూత్ స్థాయి వరకు తీసుకెళ్లడంలో ఈ విధానం అద్భుత ఫలితాలు ఇస్తోందన్నారు. పని చేసే వారికే పార్టీలో ప్రాధాన్యత ఉంటుందన్న నారా లోకేష్ సందేశం కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు. సీనియర్ - జూనియర్ అనే తేడా లేకుండా పనిచేసే ప్రతి కార్యకర్తకు గౌరవం, గుర్తింపు లభించేలా పార్టీ వ్యవస్థను రూపొందిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేగా తాను కూడా క్లస్టర్ బాధ్యతలు నిర్వహించానని, కార్యకర్త కష్టాన్ని అర్థం చేసుకునే నాయకత్వమే టీడీపీదని అన్నారు.

**కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట**

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాజకీయంగా ఎన్నడూ లేని విధంగా కార్యకర్తలకు గుర్తింపు కల్పిస్తున్నామని ఎమ్మెల్యే వాసు తెలిపారు. ఎండోమెంట్స్ కమిటీలు, కార్పొరేషన్లు, డైరెక్టర్ పోస్టులు, చైర్మన్ పదవులు, న్యాయస్థానాల్లో పీపీలు, ఏపీపీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల చైర్మన్ పదవులు వంటి అనేక బాధ్యతల్లో టీడీపీ శ్రేణులకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. రాజకీయాల్లో గౌరవమే ముఖ్యమని, పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు ఆ గౌరవం దక్కేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.

**తెలుగు జాతి గౌరవమే టీడీపీ లక్ష్యం**

తెలుగుదేశం పార్టీ పుట్టింది తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం అని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా "నేను తెలుగు వాడిని" అని గర్వంగా చెప్పుకునే పరిస్థితిని తీసుకురావడమే పార్టీ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రానికి అభివృద్ధి దిశ లేకపోయిందని విమర్శించిన ఆయన... ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతోందన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకురావడం, ఉద్యోగ అవకాశాలు కల్పించడం, మెగా డీఎస్సీ నిర్వహించడం, కానిస్టేబుల్ నియామకాలు చేపట్టడం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఐటీ పరిశ్రమలు, అంతర్జాతీయ కంపెనీలు రావాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**సాంకేతికత వినియోగంలో టీడీపీ ఎప్పుడూ ముందే**

సాంకేతిక పరిజ్ఞానాన్ని రాజకీయాల్లో సమర్థవంతంగా వినియోగించిన తొలి పార్టీ తెలుగుదేశం పార్టీయేనని ఎమ్మెల్యే వాసు అన్నారు. డిజిటల్ మహానాడు, క్లస్టర్ మీటింగులు, భారీ ఎల్ఈడి స్క్రీన్ల ద్వారా వేలాది కార్యకర్తలను ఒకే వేదికపైకి తీసుకురావడం పార్టీ సాంకేతిక దూరదృష్టికి నిదర్శనమన్నారు. నారా లోకేష్ సోషల్ మీడియా వేదికగా ఇస్తున్న సందేశాలు, ప్రకటిస్తున్న సర్ప్రైజ్ కార్యక్రమాలు కార్యకర్తల్లో మరింత ఉత్సాహాన్ని నింపుతున్నాయని తెలిపారు.

**మహిళా శక్తికి టీడీపీ పెద్దపీట - ఎమ్మెల్యే వాసుతో మహిళల సంబరాలు**

తెలుగుదేశం పార్టీ మహిళా సాధికారతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మంత్రి నారా లోకేష్ తీసుకున్న నిర్ణయానికి మద్దతుగా మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తో కలిసి ప్రత్యేకంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు, కార్యకర్తలు పిడికిలి బిగించి "మహిళా శక్తి"కి ప్రతీకగా నిలిచేలా ఎమ్మెల్యే వాసుతో కలిసి వేడుక చేశారు. మహిళలకు రాజకీయంగా మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా టీడీపీ కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పేర్కొన్నారు.

**పండుగ వాతావరణంలో మహానాడు కేంద్రాలు**

రాజమహేంద్రవరం నగరంలోని అన్ని మహానాడు కేంద్రాల్లో ఉదయం నుంచే కార్యకర్తల రద్దీ కనిపించింది. పలుచోట్ల బ్యానర్లు, పసుపు జెండాలు, ఎన్టీఆర్ - చంద్రబాబు - లోకేష్ చిత్రాలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. మహిళా కార్యకర్తలు, యువత, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై పార్టీ నినాదాలతో ఉత్సాహాన్ని వ్యక్తం చేశారు. మహానాడు కేంద్రాల్లో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల వైద్య శిబిరాలు నిర్వహించగా, కార్యకర్తలకు ప్రత్యేక ఆతిథ్యం ఏర్పాటు చేశారు.

**నగరంలోని పలు కేంద్రాల్లో డిజిటల్ మహానాడు**

నెహ్రూ నగర్ షాదీఖానా 1, 2, 3, 50 డివిజన్లు, రౌతు తాతాలు కళ్యాణ మండపంలో 6, 29, 30, 31, 32, 33 డివిజన్లు, రాజేంద్రనగర్ కమ్యూనిటీ హాల్ 4, 5 డివిజన్లు, శ్రీకరం హాల్లో 7, 8, 14, 15 డివిజన్లు, హోటల్ జగదీశ్వరీలో 21, 22, 23, 24, 25 డివిజన్లు, ముద్రగడ హాల్లో 37, 43, 44 డివిజన్లు, బిఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో 45, 46, 47, 48, 49 డివిజన్లు, ఫారెస్ట్ ఫంక్షన్ హాల్లో 35, 38, 40 డివిజన్లు, వాడ్రేవు ఫంక్షన్ హాల్లో 9, 10, 11, 12, 13 డివిజన్లు, టింబర్ మర్చంట్ అసోసియేషన్ హాల్లో 34, 36, 39, 41, 42 డివిజన్లకు సంబంధించి డిజిటల్ మహానాడు జరిగింది. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

# నెతంజా జూనియర్ కళాశాలకు అనుమతి

**యువతకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** జవహర్ లాల్ నెహ్రూ రోడ్‌లో నెతంజా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ నిర్వహణలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు అధికారిక అనుమతి పొందినట్లు నెతంజా ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు కొమానపల్లి రణవీర్ ప్రతాప్ సిన్హా చెప్పారు. యువతకు నాణ్యమైన విద్య అందించాలనే తమ లక్ష్యంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అనుమతి నిలుస్తుందని ఆయన తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వం, రాష్ట్రసమగ్రాభివృద్ధి పట్ల ఆయన అచంచలమైన కట్టుబాటుకు తాము కృతజ్ఞతలు తెలుపుతున్నా మన్నారు.. ప్రతి రంగంలో పురోగతికి ఆయన చూపుతున్న అంకితభావం నిరంతరం ప్రోత్సాహాన్నిస్తుందని తెలిపారు.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అందించిన అచంచలమైన సహకారం సదుద్దేశపూర్వక అనుమతికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విద్యా అవకాశాలను విస్తరించడంలో ఆయన కట్టుబాటు ఈ అభివృద్ధి సాధించడానికి కీలకంగా నిలిచిందని తెలిపారు. సిటీ శాశనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు ఈ అనుమతి పొందడంలో చేసిన సిఫారసులు, అదేవిధంగా మాజీ శాశనమండలి సభ్యులు ఆదిరెడ్డి అప్పారావు అందించిన అమూల్య సహకారం, ప్రోత్సాహానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య అందించడానికి కట్టుబడి ఉన్నామని ప్రతాప్ సిన్హా ప్రకటించారు. అన్ని వర్గాల విద్యార్థులు తమ ఆశయాలను సాధించేందుకు అవకాశం కల్పించడం తమ లక్ష్యమని ప్రతాప్ సిన్హా చెప్పారు. ప్రతిభను పెంపొందించి సమాజ సమగ్ర అభివృద్ధికి తోడ్పడటమే తమ ధ్యేయమని తెలిపారు. ఇప్పటికే 30ఏళ్లుగా నేతంజా స్కూలు ద్వారా అందిస్తున్న సేవలను ఈసందర్భంగా ఆయన ప్రస్థావించారు. కళాశాల కరస్పాండెంట్ కొమానపల్లి మోజెస్ ప్రణయ్, ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఎపి వృద్ధుల, దివ్యాంగుల, అనాధల ఆశ్రమం**

# అసోసియేషన్ నూతన కమిటీ నియామకం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ వృద్ధుల, దివ్యాంగుల, అనాధల ఆశ్రమం అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటైన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నూతన కమిటీ కార్యదర్శిగా నియమితులైన తానేటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆశ్రమాల నిర్వాహకులు అందరూ ఏకత్రాటిపై నిలబడి ఈ అసోసియేషన్ రిజస్ట్రేషన్ చేయడం జరిగిందని, చిన్న చిన్న ఆశ్రమాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని, ప్రభుత్వాలు అనేక నిబంధనల నుండి ఆర్థికంగా తోడ్పాటును అందించాలని కోరారు. ఈ ఆంధ్రప్రదేశ్ వృద్ధుల, దివ్యాంగుల, అనాధల ఆశ్రమం అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షులుగా కాగితపు రాయప్ప, ఉపాధ్యక్షులుగా పగడాల ప్రసాద్, బండి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా తానేటి శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా ముత్యాల పోసికుమార్, ట్రెజరర్ గా తాతపూడి జయశ్రీ, ఎగ్జిక్యూటివ్ మెంబర్గా ముద్దాల తిరుపతిరావు నియమితులయ్యారు. ఈ కార్యక్రమానికి వివిధ ఆశ్రమాల చైర్మన్లు హాజరయ్యారు. వారి సమక్షంలో నూతన కమిటీ నియామకం నిర్వహించారు.

# ఆపరేషన్ క్లీన్ స్వీప్‌తో ప్రజలలో చైతన్యం

**విజయలక్ష్మి నగర్‌లో కమిషనర్ ఆధ్వర్యంలో పిచ్చి మొక్కల తొలగింపు**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** స్వచ్ఛ మండపేట లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 4:30 గంటలకు "ఆపరేషన్ క్లీన్ స్వీప్" కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ టి.వి. రంగారావు ఆధ్వర్యంలో విజయలక్ష్మి నగర్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, తుప్పలను తొలగించి రోడ్లను స్వీపింగ్ చేశారు. పరిసరాలను పరిశుభ్రం చేసి స్థానికులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో డి.ఇ. కె. శ్రీనివాస్, ఆర్.ఓ. ఎం. రవి, శానిటరీ ఇన్స్పెక్టర్ ఎం. సత్తిరాజు, మున్సిపల్ సిబ్బంది, స్వర్ణ వార్డు సచివాలయ సెక్రటరీలు, మెప్మా సి.ఎం.ఎం. పి. సుజాత, సి.ఓ.లు, ఆర్.పి.లు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రతి వార్డులోనూ ఇలాంటి కార్యక్రమాలు కొనసాగుతాయనీ కమీషనర్ చెప్పారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛ మండపేట సాధ్యమని కమిషనర్ తెలిపారు.

# నాయకుడు వెళ్ళిపోతే పార్టీ ఖాళీ కాదు... పవన్ హాట్ కామెంట్స్




రాజమండ్రిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నిబంధనలు కఠినంగా ఉంటాయని అంతా పాటించి తీరాలని అన్నారు. పార్టీని వీడి ఒక నాయకుడు వెళ్ళినంత మాత్రాన పార్టీ ఖాళీ కాదని జనసేన కొనసాగుతుందని ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చెప్పారు. పార్టీయే ముఖ్యం తప్ప నాయకులు కాదని ఆయన అన్నారు పార్టీలో అందరూ కలసి బలోపేతం చేసుకుంటే బాగుంటుందని అన్నారు. అలా కాకుండా తామే అంతా అని హడావుడి చేసే వెళ్ళిపోయే వారి వల్ల ఏమీ కాదని గుర్తుంచుకోవాలని పవన్ స్పష్టం చేశారు. రాజమండ్రిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీ నిబంధనలు కఠినంగా ఉంటాయని అంతా పాటించి తీరాలని అన్నారు.

**సొంత పార్టీ వారి మీదనే :** కొంత మంది నేతలు సొంత పార్టీ వారి మీదనే మీడియాలో తప్పుడు వార్తలు రాయిస్తున్నారు అని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సామాజిక మాధ్యమాలలో ట్రోలింగ్ చేయిస్తున్నారు అన్నారు అలా ఎవరు చేస్తున్నారో తన వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని ఆయన అన్నారు. కొంత మంది నాయకులు అలా చేయడం వల్ల పార్టీ మొత్తానికి ఇబ్బంది అవుతుందని పవన్ అన్నారు. ఎంతటి నాయకులు అయినా క్రమశిక్షణ దాటి ప్రవర్తిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని పవన్ హెచ్చరించారు. పరిస్థితి అక్కడి దాకా రానీయవద్దని ఆయన హెచ్చరించడం విశేషం.

**పార్టీ లైన్‌లోనే అంతా :** పార్టీలో తనను అర్థం చేసుకున్న వారు ఎవరూ విభేదించరని పవన్ అన్నారు. అంతే కాకుండా పార్టీకి సంబంధించి ఎవరు ఏది మాట్లాడాలన్నా చెప్పేందుకు ఒక వ్యవస్థ ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. ఎవరైనా దానికి లోబడే మాట్లాడాలని ఆయన సూచించారు. అంతే కానీ సోషల్ మీడియా ఉంది కదా అని ఎవరి ఇష్టానికి వారు ప్రచారం చేయకూడదని స్పష్టం చేశారు. పార్టీ ఎవరి వల్ల పెరుగుతుందో ఆలోచించాలని, ఓట్ల కోసం ప్రజల్ని ఎవర్ని ఒప్పించగలరో తెలుసుకోవాలని ఆయన పార్టీ నేతలను కోరారు. పార్టీకి సంబంధించి కఠినమైన నియమావళి ఉంటుందని దాన్ని అంతా పాటించాలని పవన్ దిశ నిర్దేశం చేశారు. జనసేనలో నేతల మధ్య విభేదాలు ఉన్నా పరిష్కారానికి సామరస్య పూర్వక విధానం ఉంటుందని పవన్ చెప్పారు. తాను క్రమశిక్షణతో కూడిన కార్యకర్తలను కోరుకుంటున్నానని పవన్ తేల్చి చెప్పారు.

**సేనానిగా వ్యూహం నాది :** జనసేన అధినేతగా వ్యూహం తాను వేస్తాను అని దాన్ని ఆచరణలో పెట్టాల్సిన బాధ్యత అయితే మీది అని పవన్ స్పష్టం చేశారు. ఇప్పటి వరకు పూర్తిగా ప్రజాస్వామ్యబద్ధంగా ముందుకు వెళ్లడానికే ప్రయత్నం చేశానని పవన్ అంటూ అలా చేసినా తనను ఏదీ చూడనీయడం లేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయకులుగా ఎవరిని పెట్టినా అందరికీ నచ్చాలని లేదని అందరూ మనకి నచ్చే వారు ఉండరని పవన్ చెప్పారు. పార్టీని నమ్మి పనిచేయడమే నేతలు కార్యకర్తల పని అని ఆయన అన్నారు.

**గ్రామ స్థాయి నుంచి :** జనసేన కమిటీలను గ్రామ స్థాయి నుంచి నియమిస్తామని ఆగస్ట్ 14 నాటికి అన్నీ పూర్తి చేస్తామని పవన్ తెలిపారు. ప్రతీ గ్రామంలో ఆగస్ట్ 15 న జెండా పండుగ నాడు ప్రతీ వారూ జెండా ఎగరవేయాలని ఆయన కోరారు. జనసేన పార్టీని బలోపేతం చేసుకుందామని రాబోయే స్థానిక ఎన్నికల్లో మన బలాన్ని నిరూపించుకుందామని ఆయన తెలిపారు.



# వైసీపీది ముమ్మాటికి గొడ్డలి పార్టీ

## మాజీ సీఎం జగన్‌పై మంత్రి వాసంశెట్టి సుభాష్ తీవ్ర విమర్శలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన వైసీపీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జగన్ పార్టీని 'గొడ్డలి పార్టీ'గా అభివర్ణించిన మంత్రి ఒక్క ఛాన్స్ అని అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని చివరకు ప్రజలు మరో అవకాశం ఇవ్వని పరిస్థితికి తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడు రాళ్లలో రత్నాలను వెతుకుతుంటే జగన్ మాత్రం రాళ్లతో గులకరాళ్ల నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెత్త నుండి సంపదను సృష్టిస్తుంటే.గత ప్రభుత్వం చెత్తపై పన్నులు వేసి ప్రజల మీద భారం మోపిందని, జగన్ పాలనలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారిందని ఆయన దుయ్యబట్టారు. ఐదేళ్ల విధ్వంసకర పాలనలో పరిశ్రమలు, పెట్టుబడులను దూరం చేసి యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేశారని మంత్రి మండిపడ్డారు. అమరావతిని గ్రాఫిక్స్ అని అవమానించిన వారే నేడు కొత్త పేర్లతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. జే-బ్రాండ్ మద్యం ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీయడం ప్రచార ఆర్భాటం కోసం ప్రభుత్వ పథకాలు, రాళ్లపై కూడా తన బొమ్మలే వేయించుకోవడం జగన్ అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలు పెరిగి ప్రజాస్వామ్య విలువలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని పెట్టుబడులు, మౌలిక వసతులు, రైతు సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ప్రజలు ఇప్పటికే వైసీపీ విధ్వంసకర పాలనను తిరస్కరించారని వారి అబద్ధపు ప్రచారాలను ఇకపై ఎవరూ నమ్మబోరని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు.

### నియోజకవర్గంలో నాలుగు మండలలో

# 10 కస్టర్‌లో డిజిటల్ మహానాడు







**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగువారి పండుగ మహానాడు స్వర్గీయ ఎన్టీఆర్ ఆశయ సాధనకై శ్రమిస్థామని ప్రతిన బూనిన టిడిపి శ్రేణులు ఇంధన పొదుపు మరియు సాంకేతిక వినియోగాన్ని ప్రోత్సహించేందుకే డిజిటల్ మహానాడు డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడుల వెల్లువ మహిళా సాధికారతకు తెదేపా ప్రాధాన్యమిస్తుంది డిజిటల్ మహానాడుతో తెదేపా శ్రేణుల్లో ఉత్సాహం ఈవీ వాహనంపై మహానాడుకు తరలివచ్చిన ఎమ్మెల్యే 6 క్లస్టర్ మహానాడుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు నియోజకవర్గం లో 10 కస్టర్ లో డిజిటల్ మహానాడు నిర్వహణ కొత్తపేట నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ 44వ మహానాడును డిజిటల్ విధానంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా క్లస్టర్ల వారీగా జరుగుతున్న ఈ మహానాడులో భాగంగా కొత్తపేట నియోజకవర్గ పరిధిలోని 10 క్లస్టర్లలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మహానాడు కార్యక్రమాలకు ప్రాధాన్యతను చాటిచెప్పేలా ఎమ్మెల్యే ఈవీ వాహనంపై వాడపాలెంలోని తన నివాసం నుంచి బయలుదేరి కొత్తపేట కాపు కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన 6వ క్లస్టర్ సమావేశానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మహానాడు రిజిస్ట్రేషన్ కార్యక్రమంలో పాల్గొని పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమం ప్రారంభంలో పార్టీ గీతాన్ని ఆలపిస్తూ కార్యకర్తల్లో ఉత్తేజాన్ని నింపారు.మహానాడు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీడీపీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తలకు ఎన్టీఆర్ అందించిన ప్రేరణను గుర్తు చేశారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తే టీడీపీకి అసలైన బలం అని అన్నారు. ఎల్ఈడి స్క్రీన్‌ల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రసంగాలను కార్యకర్తలతో కలిసి వీక్షించిన ఎమ్మెల్యే, రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తోందన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు.మీడియాతో మాట్లాడిన ఆయన, ఇంధన పొదుపు మరియు సాంకేతిక వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈసారి మహానాడును డిజిటల్ రూపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సూచనల మేరకు క్లస్టర్ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించడం వల్ల గ్రామ స్థాయి కార్యకర్తల్లోనూ పాల్గొనాలనే ఆసక్తి పెరిగిందన్నారు.తాను తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా కొనసాగుతూ నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం పొందడం గర్వంగా ఉందన్నారు. ప్రజల ఆశీర్వాదం, పార్టీ నాయకత్వం నమ్మకం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు.మహానాడు కేవలం రాజకీయ సమావేశం మాత్రమే కాదని, పార్టీ సిద్ధాంతాలు, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చర్చించే మహా వేదిక అని ఎమ్మెల్యే అన్నారు. అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల పక్షాన నిలబడటం టీడీపీ ప్రత్యేకత అని స్పష్టం చేశారు.అనంతరం ఆవిడి శ్యామల గార్డెన్‌లో నిర్వహించిన 8వ క్లస్టర్ మహానాడు, వానపల్లి సొసైటీలో జరిగిన 7వ క్లస్టర్ సమావేశాల్లో కూడా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. "స్త్రీ శక్తి" అంశాన్ని ప్రధాన థీమ్‌గా తీసుకుని నిర్వహించిన కార్యక్రమాల్లో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. మహిళా సాధికారతకు టీడీపీ ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.మహానాడు వేడుకలతో కొత్తపేట నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల్లో పండుగ వాతావరణం నెలకొంది. పార్టీ భవిష్యత్ విజయాలకు కార్యకర్తల సమిష్టి కృషి ఎంతో అవసరమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు. కార్యక్రమం రాష్ట్ర బీసీ వెల్ఫేర్ చైర్మన్ రెడ్డి అనంత కుమారి తదితరులు పాల్గొన్నారు.అనంతరం దేవరపల్లి ,గోపాలపురం, రావులపాలెం, ర్యాలీ గ్రామంలో జరిగిన మహానాడు కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. అదేవిధంగా రావులపాలెం లో జరిగిన మహానాడు లో అమలాపురం ఎంపి గంటి హరీష్ మధుర్ పాల్గొన్నారు. నియోజకవర్గం లో నాలుగు మండలలో 10 కస్టర్ లో డిజిటల్ మహానాడు నిర్మించారు.

# రామచంద్రపురంలో ఘనంగా 'మహానాడు'


## సైకిల్‌పై వేదికకు చేరుకుని ఆకట్టుకున్న మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'మహానాడు' కార్యక్రమం పండుగ వాతావరణంలో సాగింది. నియోజకవర్గంలోని క్లస్టర్-1, క్లస్టర్-2 ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తన స్వగృహం నుండి సైకిల్ తొక్కుకుంటూ నేరుగా మహానాడు వేదికకు చేరుకోవడం స్థానికంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, పార్టీ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, వార్డు కమిటీ సభ్యులు మరియు వేలాది మంది కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. పసుపు జెండాలు, పార్టీ నినాదాలతో మహానాడు ప్రాంగణం మార్మోగిపోగా మంత్రికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. వేదిక వద్ద జెండా ఆవిష్కరణ మరియు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి మంత్రి సుభాష్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ ప్రసంగిస్తూ మహానాడు అనేది కేవలం ఒక రాజకీయ సభ మాత్రమే కాదని తెలుగు జాతి ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్థాపించిన తెలుగుదేశం పార్టీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో సంక్షేమం మరియు అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. గత పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు విజన్, పరిపాలన దక్షతతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని ఆయన వివరించారు. యువతకు స్ఫూర్తిగా ప్రేరణగా నిలుస్తున్న మంత్రి నారా లోకేష్, తన 'యువగళం' పాదయాత్రతో రాష్ట్ర రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని మంత్రి సుభాష్ ప్రశంసించారు. ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు, మహిళా సాధికారత, రైతులకు ప్రోత్సాహం అందించడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని తెలిపారు. మహానాడు వంటి కార్యక్రమాలు పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్న భోజన సమయంలో కార్యకర్తలకు స్వయంగా భోజనం వడ్డిస్తూ అందరినీ ఆప్యాయంగా పలకరించిన మంత్రి సుభాష్, పార్టీ శ్రేణులకు దగ్గరై వారిలో గొప్ప ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

### శ్రీ కోదండరామాలయం నిర్మాణానికి

# రూ.3 లక్షల చెక్కు అందజేత



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం నియోజకవర్గం కాజులూరు మండలం ఆంద్రంగి గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ కోదండరామ దేవాలయం అభివృద్ధికి కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం రూ.3 లక్షల రూపాయల చెక్కును దేవాలయ కమిటీ సభ్యులకు అందజేశారు. దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన ఈ నిధులతో దేవాలయ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు దేవాలయాలు ప్రతీకలని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో దేవాలయాలు ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు కేంద్రాలుగా నిలుస్తాయని అన్నారు. శ్రీ కోదండరామాలయం నిర్మాణం పూర్తయితే గ్రామ ప్రజలకు మరింత ఆధ్యాత్మిక వాతావరణం కలుగుతుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన ఆలయాల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని హిందూ ధార్మిక సంస్థల అభివృద్ధి కోసం మరిన్ని నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ... ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని గ్రామ ప్రజల సహకారంతో నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, భక్తులు, పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఖరీఫ్ 2026 ముందస్తు సాగునీటి విడుదల

## రామచంద్రాపురం మండల రైతుల కోసం ప్రత్యేక మార్గదర్శకాలు



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రపురం మండలంలో ఖరీఫ్ 2026 సాగు కోసం జూన్ 1వ తేదీన సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో మండల వ్యవసాయాధికారి టి.వి.ఆర్. మణిదీప్ ఆధ్వర్యంలో ఉండూరు, కందులపాలెం, హసనాభాద గ్రామాల్లో రైతులతో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో కీలక అంశాలు చర్చించబడ్డాయి. ఈ ముందస్తు నీటి విడుదల వల్ల పంటలకు అవసరమైన నీరు అందుబాటులోకి రావడమే కాకుండా రైతులు సమయానికి సాగు పనులు ప్రారంభించి, తద్వారా మెరుగైన దిగుబడులను సాధించి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే అవకాశం ఉంది. ఈ ప్రయోజనాలను అందిపుచ్చుకోవాలని అదే సమయంలో నీటిని పొదుపుగా వినియోగించాలని వ్యవసాయ మరియు నీటిపారుదల శాఖలు రైతులకు సూచించాయి. ముందస్తు సాగు పనుల ద్వారా పంటలను తుఫానుల నుండి కాపాడుకోవచ్చు ఎందుకంటే నిర్ణీత సమయంలో పంట కాలం పూర్తయ్యి కోతల సమయంలో తుఫానుల ముప్పు తగ్గుతుంది. అలాగే ఎల్ నినో ప్రభావాలను కూడా ఈ ముందస్తు విత్తనాలతో సమర్థవంతంగా ఎదుర్కోవచ్చు. రామచంద్రాపురం మండలంలో ఈ సీజన్‌కు అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు మరియు పురుగుల మందులు ఇప్పటికే సిద్ధంగా ఉన్నందున రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి. వ్యవసాయ శాఖ సూచనల మేరకు రైతులు దీర్ఘకాలిక పంట రకాలకు బదులుగా తక్కువ లేదా మధ్యస్థ కాలపరిమితి గల రకాలను ఎంచుకోవడం ఉత్తమం. పంట సాగుతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా అత్యంత ముఖ్యం. పంట వ్యర్థాలను తగలబెట్టడం వల్ల వాతావరణంలోకి మీథేన్, కార్బన్ మోనాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు మరియు ఇతర హానికర గ్రీన్‌హౌస్ వాయువులు విడుదలవుతాయి. వరిగడ్డిని కాల్చినప్పుడు 70% కార్బన్‌డై ఆక్సైడ్, 7% కార్బన్ మోనాక్సైడ్ మరియు 0.66% మీథేన్ వెలువడుతాయి. గడ్డిలోని నత్రజని నైట్రస్ ఆక్సైడ్‌గా మారి గాలిని కలుషితం చేస్తుంది. ఈ పొగ వల్ల ఊపిరితిత్తుల వ్యాధులు రావడమే కాకుండా క్యాన్సర్ కారకాలు వెలువడే ప్రమాదం కూడా ఉంది. కాబట్టి, రైతులు పంట వ్యర్థాలను కాల్చివేయకుండా పర్యావరణాన్ని కాపాడుతూ సాగు పనులు చేపట్టాలని కోరుతున్నాము.

# ఘనంగా మహానాడు వేడుకలు




**కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ :** ముమ్మిడివరం నియోజకవర్గంపరిధిలో క్లస్టర్ 4 చెయ్యేరు, కందికుప్ప గ్రామాల్లో మహానాడు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వర్చువల్ విధానంలో ఈ వేడుకలు జరిగాయి. మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఈ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పేదవాడు రాజకీయంలోకి ప్రవేశించడానికి అవకాశం కల్పించిన మహనీయుడు ఎన్టీఆర్ అని రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వరావు అన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా టిడిపి నిలుస్తుందనిమండల టిడిపి అధ్యక్షుడు చెల్లి సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోవాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆకాశంశ్రీనివాస్, త్సవటపల్లి శ్రీనివాస్, విత్తనాల బుజ్జి, గంగు మళ్ల భద్రరావు, గోకర కొండ సత్యనారాయణ మూర్తి, వనచర్ల నాగేశ్వరరావు, కాంద్రేకుల సత్య ప్రసాద్,మండల తెలుగు యువత అధ్యక్షుడు వంగదుర్గ బాబు, బండారు ఏసు,నల్లా రామకృష్ణ, మట్ట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ద్రాక్షారామ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం

## విద్యార్థులకు వ్యాస రచన పోటీలు



**ద్రాక్షారామ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో, ద్రాక్షారామ శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న 'వేసవి విజ్ఞాన శిబిరం' కార్యక్రమం విజయవంతంగా కొనసాగు తోంది. ఈ నెల 28వ తేదీన ప్రారంభమైన ఈ శిబిరం జూన్ 6వ తేదీ వరకు కొనసాగనుంది. ఇందులో భాగంగా బుధవారం 25వ రోజున స్థానిక పాఠశాల విద్యార్థుల కోసం 'సెల్ ఫోన్ వాడకం వల్ల ఉపయోగాలు – అనర్థాలు' అనే అంశంపై వ్యాస రచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రిటైర్డ్ అధ్యాపకులు బి.శివరావు పర్యవేక్షించారు. విద్యార్థులు సెల్ ఫోన్ వినియోగంపై తమ అవగాహనను వ్యాసాల ద్వారా చక్కగా వ్యక్తీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎం.వి. సూరిబాబు, గ్రంథాలయ పాఠకులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పైన కాదు కిందకు చూడు... ఏపీ పాలిటిక్స్‌లో బిగ్ చేంజ్ !

రాజకీయం అంటే టాప్ లెవెల్ లో సాగేది. అంతా అంతపురం రహస్యాల మాదిరిగా ఉండేది. కోటలూ కోటరీలు అగ్ర నాయకుల మంతనాలు అక్కడే నిర్ణయాలు వాటిని అమలు చేయమని పై నుంచి దిగువ దాకా ఆదేశాలు. దాంతో రాజకీయం రక్తి కట్టేది. అంతా బాగానే సాగిపోయేది. రాజకీయ అధినాయకత్వాలు సైతం తమ చుట్టూ నలుగురుని ఉంచుకుని వారితోనే పార్టీ అంతా అనుకుంటూ పోతే అది ఇంకా బాగుండేది. కానీ కాలం మారుతోంది. అభిప్రాయాలు కూడా మారుతున్నాయి. రాజకీయం అంటే పైన కాదు కిందకు చూడు అంటోంది లేకపోతే పునాదులు సైతం కూలి మొత్తం రాజకీయమే కుప్ప కూలుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. అలాంటి ఉదంతాలు ఉదాహరణలు ఏపీలోనూ దేశంలోనూ చాలా చోట్ల జరిగాయి. ఆ బాధిత రాజకీయాన్ని చూసి అంతా ఇపుడు సర్దుకుంటున్నారు.

**కార్యకర్తే జీవగర్ర :** ఏ రాజకీయ పార్టీకి అయినా కార్యకర్తలే ముఖ్యం. వారే జీవ గర్ర. ఒక విధంగా చెప్పాలీ అంటే రాజకీయ పార్టీ అనే భవనానికి పునాదులు పైన ఎక్కడో లేవు. అవి భూతలం మీదనే ఉన్నాయి. గ్రౌండ్ లెవెల్ లోనే ఉన్నాయి. అక్కడ కనుక పటిష్టంగా లేకపోతే ఎంతటి భవనం అయినా కుప్ప కూలుతుంది. ఇది అవగతం అయిన రాజకీయ పార్టీలు ఇపుడు అంతా కిందకే చూస్తున్నాయి. క్షేత్ర స్థాయికే ప్రాధాన్యత ఇస్తున్నాయి. కార్యకర్తే మాకు కావాలి అని నినాదాలు ఇస్తున్నాయి. ఏపీలో తెలుగుదేశం వైసీపీ జనసేన పార్టీలలో ఇపుడు కార్యకర్తలకే అధిక ప్రాధాన్యత దక్కుతోంది.

**సగటు నేతకు పొలిట్ బ్యూరో :** తెలుగుదేశం పార్టీలో సగటు కార్యకర్తలకు పొలిట్ బ్యూరో వంటి అత్యున్నత విధాయక మండలిలో చోటు కల్పించి తెలుగుదేశం తానేంటో నిరూపించుకుంది. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకే పెద్ద పీట అని మాటలకే చెప్పడం కాదు చేతలలోనూ నిరూపించుకుంది. పార్టీలో కీలక పదవులు వారికే దక్కుతున్నాయి. నామినేటెడ్ పదవులు వారికే ఇస్తున్నారు. అంతే కాదు మంత్రుల దాకా కొత్త వారికి చాన్స్ ఇస్తూ టీడీపీలో ఒక కొత్త విప్లవానికి నాంది పలికింది. రానున్న కాలంలో కొత్త నాయకత్వం రావాలన్న పార్టీకి విజయాలు దక్కాలన్నా కూడా క్యాడర్ నుంచే అన్నది టీడీపీ అర్థం చేసుకున్నంతగా ఎవరూ అర్థం చేసుకోలేదు అని చెప్పాల్సిందే.

**వైసీపీ మేలుకుంటోంది :** ఇక వైసీపీ విషయం తీసుకుంటే ఆ పార్టీ కూడా మేలుకుంటోంది. 2024 ఎన్నికల్లో కార్యకర్తలు పార్టీని పట్టించుకోకపోవడం వల్ల ఎంతటి భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వచ్చిందో వైసీపీ కంటే ఎవరికీ ఎక్కువగా తెలియదు అని చెప్పాలి. అందుకే వైసీపీ ఎన్నికల అనంతరం కార్యకర్తల జపం చేస్తోంది. వైసీపీ 2.0లో కార్యకర్తలకే పెద్ద పీట అని అధినాయకత్వం పదే పదే చెప్పడం వెనక కూడా ఈ మూల సూత్రమే దాగి ఉంది. అధినాయకుడికి ఎంతటి ఇమేజ్ ఉన్నా గ్రౌండ్ లో పనిచేసేది క్యాడర్ మాత్రమే అని వారికి అసంతృప్తి కలిగి అలిగి దూరం వెళ్తే పార్టీ పుట్టె మునుగుతుందని అనుభవం పూర్వకంగా తెలుసుకున్న వైసీపీ దిద్దుబాటు చర్యలకు దిగుతోంది. అందులో భాగమే బూత్ లెవెల్ దాకా కమిటీలు వేయడంతో పాటు పనిమంతులకు పార్టీలో కీలక స్థానాలు కల్పిస్తమని చెబుతోంది. అలా వైసీపీ బూత్ లెవెల్ కార్యకర్తలే మార్గదర్శకులు అంటోంది.

**సాధకులతో సేన :** ఇక ఏపీలో మరో కీలక పార్టీ జనసేన సాధకులతో పార్టీని కొత్త పుంతలు తొక్కిస్తోంది. ఉద్యమి సాధక్ అంటూ జనసేన కొత్త అంగాలను నిర్మించింది. వీరంతా కూడా గ్రౌండ్ లెవెల్ నుంచి వచ్చిన వారే కారణం. అధినేత పవన్ సైతం సాధకులే పార్టీకి వెన్నెముక అని స్పష్టంగా చెప్పారు. వారి సేవలను పార్టీ వినియోగించుకుంటుంది అని కూడా భరోసా ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే సాధకులకు గుర్తింపు కచ్చితంగా ఉండేలా జనసేనలో కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. మొత్తం మీద చూస్తే రాజకీయం మారుతోంది. పక్క ఉన్న అగ్ర నేతలను చూసి ధీమా పడే రోజులు పోయాయి. వారే పార్టీ అనుకుని నిర్ణయాలు ఏకపక్షంగా తీసుకుంటే బొక్క బోర్లా పడతామన్నది కూడా పార్టీలకు అర్థం అయింది. దాంతో కష్టించి పనిచేసే కార్యకర్తలకు ఇపుడు మంచి రోజులు వస్తున్నాయని అంటున్నారు. అంతే కాదు వీరి నుంచి రాబోయే కాలానికి కాబోయే నాయకులు పుట్టుకుని వస్తారని కూడా చెబుతున్నారు.



# తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక - తెలుగుదేశం పార్టీ పతాకం

## తెలుగు దేశం పార్టీ మహానాడు 2026' వక్తల ఉద్ఘాటన - పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని నింపిన మహానాడు





**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగు దేశం పార్టీ పతాకం తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక అని ఎమ్మెల్సీ కరణం ధర్మశ్రీ పేర్కొన్నారు. జాతీయ పార్టీల నియంత పాలనలను ధిక్కరిస్తూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవానికి ప్రతీకగా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్టీఆర్ "కూడు, గూడు, గుడ్డ" నినాదంతో తెలుగుదేశం పార్టీని స్థాపించారని ఆమె వివరించారు. తెలుగు దేశం పార్టీ ప్రతిష్టాత్మక వార్షికోత్సవం మహానాడు 2026' మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ప్రారంభమైంది. పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ జెండాను ఆవిష్కరించి ఈ రెండు రోజుల (27, 28) 'పసుపు పండుగ'ను ప్రారంభించారు. దీనికి సమాంతరంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28 జిల్లాలు, 175 నియోజకవర్గాల వ్యాప్తంగా ఉన్న 1,875 క్లస్టర్ కేంద్రాల్లో ప్రత్యేక ఎల్ఈడీ స్క్రీన్లు, నాణ్యమైన సాంకేతిక వసతులతో ఈ మహానాడు కార్యక్రమాలను ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగానే కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో మహానాడు జరిగింది. ఏలేశ్వరంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాలులో క్లస్టర్-3 ఇంచార్జి బొదిరెడ్డి గోపి ఆధ్వర్యంలోను, శంఖవరం మండలం అన్నవరంలోని కెకె. ఫంక్షన్ హాలులో క్లస్టర్-7 ఇంచార్జి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా ఈశ్వరుడు ఆధ్వర్యంలోనూ, అలాగే క్లస్టర్-8 ఇంచార్జి రాష్ట్ర పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ ఆధ్వర్యంలోనూ వేర్వేరుగా మహానాడును నిర్వహించారు. ముందుగా కార్యక్రమాన్ని జ్యోతీ ప్రజ్వలనంతో ప్రారంభించి, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారకరామారావు, ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ దివంగత నేత వరుపుల రాజా చిత్రపటాలకు పూల మాలలను వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు, కార్యకర్తలు పరస్పరం ఆత్మీయ శుభాకాంక్షలు తెలుపు కున్నారు. ఈ డిజిటల్, హైబ్రిడ్, వర్చువల్ మహానాడుకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, నియోజకవర్గం పార్టీ పరిశీలకురాలిగా పి.విజయలక్ష్మి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ... పార్టీని స్థాపించిన అతి తక్కువ కాలంలోనే అధికారం చేపట్టిన ఘనత ఒక్క తెలుగు దేశం పార్టీకే దక్కుతుంది అన్నారు. ఆ సిద్ధాంతాలను కొనసాగిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమర్ధవంతంగా పార్టీని ముందుకు తీసుకు వెళు_న్నారని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోంది అన్నారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీకి కొత్త ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో మరింత నమ్మకం పెరిగిందిని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పర్వత సురేష్ మాట్లాడుతూ మహానాడు కేవలం పార్టీ వార్షిక సమావేశం మాత్రమే కాదని, రాష్ట్ర భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసే చారిత్రాత్మక వేదిక అని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మహిళా సాధికారత లక్ష్యాలతో తెలుగుదేశం పార్టీ నిరంతరం ముందుకు సాగుతుందని తెలిపారు. ఈసారి "స్త్రీ శక్తి" నినాదంతో మహానాడు నిర్వహించడం ప్రతి తెలుగు మహిళ గర్వపడే విషయం అన్నారు. అలాగే ఇంధన పొదుపు, సాంకేతిక వినియోగం దృష్ట్యా ఈ ఏడాది మహానాడును డిజిటల్ రూపంలో నిర్వహించడం అభినంద నీయమని చెప్పారు. పార్టీ ఆవిర్భావం నుంచి మహిళలకు రాజకీయ, సామాజిక ప్రాధాన్యత కల్పిస్తూ సాధికారతకు అండగా నిలుస్తోందని అన్నారు. మహానాడు తీర్మానాలు రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అద్దం పడతాయని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మహానాడు వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు వివరిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి టిడిపి లక్ష్యమని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి, అభివృద్ధికి అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర పార్టీ కార్యదర్శి పర్వత సురేష్ పిలుపును ఇచ్చారు. సభా ప్రాంగణాలు అన్నీ మొత్తం పసుపు జెండాలతో కళకళలాడగా, కార్యకర్తల నినాదాలు మార్మోగాయి. అధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని మహానాడు వేడుకలను విజయవంతం చేశారు.

# హైబ్రిడ్ మహానాడు వర్చువల్ క్లస్టర్ సమావేశాలు



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఏలేశ్వరంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచనలతో ఎన్ కన్వెన్షన్ హాల్లో హైబ్రిడ్ మహానాడు వర్చువల్ క్లస్టర్ సమావేశాలు ఘనంగా నిర్వహించారు. మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల పెదబాబు మరియు ఎంపీపీ, క్లస్టర్-1 ఇంచార్జి గొల్లపల్లి బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమం ప్రారంభానికి ముందు పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకులు అన్న నందమూరి తారక రామారావు, దివంగత వరుపుల రాజా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. తదుపరి మహానాడు ప్రత్యక్ష ప్రసారాన్ని బూత్ కమిటీ కన్వీనర్లు, కో-కన్వీనర్లు, తెలుగు దేశం పార్టీ అనుబంధ విభాగాల సభ్యులు, అభిమానులు కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ కుమార్ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలవాలనే సంకల్పంతో "కూడు, గూడు, గుడ్డ" నినాదంతో అన్న నందమూరి తారకరామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని గుర్తుచేశారు. అదే ఆశయాలను కొనసాగిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు సమర్ధవంతంగా పార్టీని ముందుకు నడిపిస్తున్నారని తెలిపారు. యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రతో పార్టీకి నూతన ఉత్సాహం వచ్చిందని, కార్యకర్తల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ 2 ఇంచార్జి ధనేకుల భద్రరావు, కో కన్వీనర్లు బస్సా మహాలక్ష్మి ప్రసాద్, కోరుకొండ నూకరాజు, మండల తెలుగు యువత పెంటకోట శ్రీధర్, నాయకులు సూతి బూరయ్య, పసల సూరిబాబు, చిక్కాల లక్ష్మణరావు, బుద్ధ సూర్య ప్రకాష్, బుద్ధ ఈశ్వరరావు, సూతి వీర ప్రభాకర్, మైరాల కనకారావు, జిగటాపు సూరిబాబు, అరక రాజు, నూకతాటి ఈశ్వరుడు పాల్గొన్నారు.

# కాకినాడ రూరల్ నియోజవర్గం అభివృద్ధే లక్ష్యం



### ఎమ్మెల్యే పంతం నానాజీ

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రూరల్ నియోజకవర్గంలో జరుగుతున్న, జరగబోయే అభివృద్ధి పనులు మరియు సంక్షేమ పథకాలపై శాసన సభ్యులు పంతం నానాజీ బుధవారం స్థానిక రూరల్ మండలం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో కలిసి ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించేందుకు వీలుగా ఎంపీడీఓ కార్యాలయం నుండి ప్రత్యేకంగా సివి ఏపీ నియమించబడ్డ కమిటీ బృందంలోని ఐదుగురు సభ్యులు వ్యవసాయం, నీటి పారుదల, ఇరిగేషన్, విద్య, వైద్యం, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్అండ్‌బీ తదితర శాఖల ప్రగతి నివేదికలపై కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే సుదీర్ఘంగా చర్చించారు. నియోజకవర్గంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం స్థానిక స్థాయిలో పి4 సమర్ధవంతంగా అమలు అయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆదేశించారు. ఈసమీక్షలో ముఖ్యమంత్రి సహాయ నిధుల పంపిణీపై ఎమ్మెల్యే పంతం నానాజీ సీఎం రిలీఫ్ ఫండ్ సహాయం పేదలకు అందే విషయంలో 100 శాతం పారదర్శకత ఉండాలని స్పష్టం చేశారు. ఎవరైనా తప్పుడు మెడికల్ బిల్లులు లేదా అసత్య వివరాలతో ప్రభుత్వ నిధులను పక్కదారి పట్టించాలని చూస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నియోజకవర్గ అభివృద్ధిలో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి నిర్దేశిత లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

### నులుకుర్తి వెంకటేశ్వరరావు



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధినీ క్షేత్రస్థాయి వరకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని కాకినాడ రూరల్ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ నులుకుర్తి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ మండలంలో నిర్వహించిన క్లస్టర్ మహానాడు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల కోసం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర భవిష్యత్తు కోసం పడుతున్న కష్టం కోసం ప్రసంగించారు. పార్టీ బలోపేతానికి, రాబోయే కాలంలో మరింత మెరుగైన ఫలితాల కోసం ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని ఆయన ఉద్బోధించారు. క్లస్టర్లు వాసంశెట్టి అంజిబాబు, కర్రి వెంకటరాజు, పేరాబత్తుల లోవబాబు, కొల్లబత్తుల అప్పారావుల సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో క్లస్టర్ మహానాడు ఉత్సాహంగా సాగింది. ప్రభుత్వం చేపట్టిన వినూత్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మాసుమేను గంగయ్య, పితాని అప్పన్న, గీసాల శ్రీను, కొండ వినాయక్, కాకరపల్లి చలపతిరావు, టేకుమూడి శ్రీను, మోసుమేను శ్రీనివాస్, యూనిట్ ఇంచార్జిలు, బూత్ కన్వీనర్లు, కుటుంబ సాధికార సారథులు పాల్గొని పార్టీ పటిష్టతకు తమ సంపూర్ణ సహకారం అందిస్తామని పునరుద్ఘాటించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త హరిత సమరానికి శ్రీకారం

## జీవ వైవిధ్యం, పర్యావరణ స్థిరత్వమే లక్ష్యం - మహా యజ్ఞంలా విత్తన బంతుల తయారీ పంపిణీ

## 2.5 కోట్ల విత్తన బంతుల పంపిణీకి సన్నాహాలు - కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు - విత్తన బంతుల తయారీపై అన్నవరంలో శిక్షణ



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనాన్ని, ఆరోగ్య కరమైన వాతావరణాన్ని పెంపొం దించడమే లక్ష్యంగా సరికొత్త హరిత సమరానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు పేర్కొన్నారు. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని, పర్యావరణ సమతుల్యతను అందించడం కోసం ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో రాష్ట్ర అటవీ శాఖ 2.5 కోట్ల విత్తన బంతుల (సీడ్ బాల్స్) పంపిణీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆయన వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం - కాకినాడ డివిజన్ అటవీశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం ఏలేశ్వరం అటవీశాఖ రేంజ్ పరిధిలోని శంఖవరం మండలం అటవీ శాఖ సెక్షన్ పరిధి అన్నవరంలోని అటవీశాఖ శిబిరం కార్యాలయం ఆవరణలో విత్తన బంతుల (సీడ్ బాల్స్) తయారి విధానంపై శిక్షణా కారక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శంఖవరం అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్ గంటిమళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని జిల్లా అటవీశాఖధికారి రామచంద్రరావు ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించే, ఎటువంటి శ్రద్ధ లేకుండానే వర్షాకాలంలో అటవీ ప్రాంతాలు, ఖాళీ స్థలాల్లో మొక్కలుగా పెరగడానికి ఉద్దేశించిన విత్తన బంతుల తయారీలో అటవీశాఖ సిబ్బంది, వన సంరక్షణ సిబ్బంది, గ్రీన్ కల్టివేషన్ ఎన్జీవో సంస్థ బృంద సభ్యులు మొత్తం సుమారు 80 మంది వరకూ శిక్షణ ఇచ్చారు. పాల, ఎర్రచందనం, గానుగ, రేల, గుమ్మడి, టేకు తదితర రకాల విత్తనాలను, సారవంతమైన, మృదువైన మట్టిని ఉపయోగించి సుమారు 1000 విత్తన బంతులను తయారు చేయించారు. ఈ సందర్భంగా శిక్షణార్థులను ఉద్దేశించి ముఖ్య అతిథిగా డి.ఎఫ్.ఓ. మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ కోసం చేపట్టిన ఈ హరిత సమరంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విత్తన బంతుల తయారీ కార్యక్రమాలు జరుగు తున్నాయి అన్నారు. దీనిని ఒక ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రజా ప్రతినిధులు, పొదుపు సంఘాల మహిళలు, ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది, పాఠశాల, కళాశాల విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వాలంటీర్లతోపాటు రాష్ట్ర ప్రజలను, అన్ని వర్గాల ప్రతినిధులను ఇందులో భాగస్వామ్యం చేస్తున్నారన్నారు. వర్షాకాలాన్ని పూర్తిగా వినియోగించుకుంటూ జులై, ఆగస్టు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఈ విత్తన బంతులను విస్తారంగా చల్లడానికి అటవీ శాఖ ప్రణాళికలు సిద్ధం చేసిందని ఆయన వెల్లడించారు. ఇందుకోసం మూడు రకాల ప్రత్యేక పద్ధతులను ఉపయోగిస్తాం అన్నారు. నేరుగా చల్లడం, అత్యాధునిక డ్రోన్ల సాంకేతికత ఉపయోగించడం, చేతులతోనూ నాటుతామన్నారు. అడవుల్లో జీవవైవిధ్యాన్ని పెంపొందించడం, పర్యావరణ పరిణామాన్ని మెరుగు పరచడం, పర్యావరణ స్థిరత్వాన్ని కాపాడ్డం, పచ్చదనాన్ని పెంచడం, వాతావరణ మార్పులను సమర్థవంతంగా తట్టుకునే విధంగా స్వచ్ఛమైన, పచ్చని ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించడం కోసం ఈ హరిత ఉద్యమం ప్రధాన లక్ష్యని ఆయన వివరించారు. ఈ అంశాలపై శిక్షణార్థులకు, అటవీ శాఖ అధికారులకు, సిబ్బందికీ కాకినాడ జిల్లా అటవీశాఖ అధికారి రామచంద్రరావు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్.ఆర్.ఓ. కె.రామ దుర్గా ప్రసాద్, డిప్యూటీ ఆర్.ఓ. జాన్సన్, ఎఫ్.ఎస్.ఓలు. జి.నాగేశ్వర్రావు, పి.శ్యామ్ కుమార్, ఎఫ్.బిఓలు. పి.లావణ్య, పి.వెంకటరమణ, కె.భీమశంకరం, డి.శ్రీవిద్య, కె.మీనాక్షి, కాకినాడ జిల్లా ఎఫ్.బి.ఓలు, ఎబిఓలు, గ్రీన్ కల్టివేషన్ ఎన్జీవో సంస్థ ప్రతినిధులు రాజేశ్వరి, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

# ముందుంది అసలైన పెట్రో మంట.. లీటరుకు రూ. 28 నుంచి రూ. 33 వడ్డిస్తారా?

దేశంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వాహనదారులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికే లీటరుపై దాదాపు రూ.8 వరకు ధరలు పెరిగినప్పటికీ, ముడిచమురు సంక్షోభం సృష్టించిన నష్టాల నుంచి ఆయిల్ కంపెనీలు ఇంకా పూర్తిగా కోలుకోలేదని అంటున్నారు. దీంతో ధరలు మరింత పెంచాలని చమురు కంపెనీలు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నాయని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చమురు సంస్థలు నష్టాల నుంచి గట్టెక్కాలంటే రానున్న రోజుల్లో ఇంధన ధరలను మరింత పెంచక తప్పని పరిస్థితి కనిపిస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. దీంతో కేంద్రం పెట్రోల్ ధరల పెంపును రోజువారీ ఎపిసోడ్ గా మార్చేస్తుందా? అన్న భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.28 నుంచి రూ.33 వరకు పెరిగితేనే రికవరీ?**

గత కొన్ని నెలలుగా అంతర్జాతీయ మార్కెట్లో నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ కంపెనీలు భారీగా నష్టపోయాయని చెబుతున్నారు. ఈ నష్టాలను పూర్తిగా భర్తీ చేసుకుని, సాధారణ స్థితికి రావాలంటే లీటర్ పెట్రోల్, డీజిల్‌పై మరో రూ.28 నుంచి రూ.33 వరకు ధరలను పెంచాల్సి ఉంటుందని చమురు సంస్థలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.




ఇప్పటికే నాలుగు విడతలుగా సుమారు 8 రూపాయలను ప్రభుత్వం పెంచింది. ఈ ధర మరింత పెరిగితే అన్నిరకాల వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని భయపడుతున్నారు.

**20 రూపాయలు పెరిగే చాన్స్?**

ప్రస్తుత మార్కెట్ పరిస్థితులు, విశ్లేషకుల అంచనాల ప్రకారం, లీటరుపై మరో రూ.20 పెరిగే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. అయితే ఒకేసారి రూ.20 నుండి రూ.30 వరకు పెంచితే దేశ ఆర్థిక వ్యవస్థపై, ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం పడుతుందని కేంద్రం భావిస్తోందని అంటున్నారు. సామాన్య ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమయ్యే పరిస్థితి ఉన్నందున ధరల పెంపు ఒక్కసారిగా కాకుండా విడతల వారీగా ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. రోజువారీ లేదా వారపు ధరల సవరణల విధానం తీసుకువచ్చి రేట్లను పెంచే వ్యూహాన్ని అవలంబించవచ్చునని అభిప్రాయపడుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు మరో రూ.20 వరకు పెరిగితే, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగిపోతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనివల్ల పాలు, కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆయిల్ కంపెనీల నష్టాలను తగ్గించడానికి ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం లేదా సబ్సిడీల రూపంలో ఊరటనివ్వాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.

### టాలీవుడ్‌లో ఆ ముగ్గురు హీరోలు అంటే చాలా ఇష్టం..

# నాతో ఎంతో బాగుంటారు.. హీరోయిన్ స్నేహ..



టాలీవుడ్ ఇండస్ట్రీలో ఒకప్పుడు అగ్ర కథానాయికగా ఓ వెలుగు వెలిగిన హీరోయిన్లలో స్నేహ ఒకరు. గ్లామర్ షోకు దూరంగా ఉంటూ సంప్రదాయ పద్ధతిలో కనిపిస్తూనే తనదైన నటనతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్నారు. ఒకప్పుడు కథానాయికగా అలరించిన ఆమె.. ఇప్పుడు సహాయ నటిగా రాణిస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలుగులో తనకు ఇష్టమైన ముగ్గురు హీరోల గురించి చెప్పుకొచ్చారు. టాలీవుడ్‌లో ఒకప్పుడు హోమ్లీ బ్యూటీగా, స్టార్ హీరోయిన్‌గా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్ స్నేహ. 'ప్రియమైన నీకు', 'హనుమాన్ జంక్షన్', 'వెంకీ', 'శ్రీరామదాసు' వంటి ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేశారు. వివాహం తర్వాత సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చిన ఈ సీనియర్ నటి, సెకండ్ ఇన్నింగ్స్‌లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణిస్తున్నారు. ఈ క్రమంలోనే గతంలో ఒక ఇంటర్వ్యూలో టాలీవుడ్ హీరోల గురించి, ముఖ్యంగా రామ్ చరణ్, అల్లు అర్జున్, నాగార్జున గురించి స్నేహ పంచుకున్న ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు మళ్లీ నెట్టింట వైరల్ అవుతున్నాయి. నటి స్నేహకు టాలీవుడ్‌లో ఎంతోమంది స్టార్ హీరోలతో కలిసి పనిచేసిన అనుభవం ఉంది. అయితే ప్రస్తుత తరం హీరోల్లో ఆమెకు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అంటే ప్రత్యేకమైన అభిమానమని తెలిపింది. తనకి టాలీవుడ్‌లో నాగార్జున, అల్లు అర్జున్, రామ్ చరణ్‌ల నటన ఎంతో ఇష్టమని తెలిపారు. వారి నటన చాలా సరదాగా ఉంటుందని స్నేహ పేర్కొన్నారు. ముఖ్యంగా శ్రీరామదాసు చిత్రంలో నాగార్జున నటన చాలా గొప్పగా ఉందని అన్నారు. తనకు తెలుగులో నాగార్జున, రామ్ చరణ్, నాగార్జున ముగ్గురు హీరోలు అంటే చాలా అభిమానమని అన్నారు. ఇక తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచిన 'శ్రీరామదాసు' సినిమా గురించి కూడా స్నేహ గుర్తుచేసుకున్నారు. కింగ్ నాగార్జున సరసన ఆమె పోషించిన పాత్రకు అప్పట్లో ప్రేక్షకుల నుండి భారీ ప్రశంసలు దక్కాయి. ఇప్పటికీ ఆ సినిమా విజువల్స్, పాటలు ఎవర్ గ్రీన్ అని ఆమె చెప్పుకొచ్చారు. సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు చేయడమే కాకుండా, నిజ జీవితంలోనూ ఎంతో హుందాగా ఉండే స్నేహ.. పరిశ్రమలో తనకు ఎందరో రోల్ మోడల్స్ ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం వైవాహిక జీవితాన్ని ఆస్వాదిస్తున్న నటి స్నేహ, 2012లో వివాహం అనంతరం సినిమాల్లో నటించడం తగ్గించారు. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో రాణించి, హోమ్లీ హీరోయిన్‌గా గుర్తింపు పొందిన స్నేహ, ప్రస్తుతం రామ్ చరణ్-బోయపాటి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రంలో కీలక పాత్రలో నటించారు. ప్రతిరోజు ఉదయాన్నే నిద్రలేచి యోగా, వాకింగ్ వంటివి చేస్తానని, అందుకే తన శరీరం చురుకుగా ఉంటుందని స్నేహ వెల్లడించారు. చివరగా, తనకు ప్రత్యేకంగా రోల్ మోడల్స్ ఎవరూ లేరని, తనకి తానే రోల్ మోడల్ అని స్నేహ స్పష్టం చేశారు.

# మహేష్ బాబు డిగ్రీ ఐడెంటిటీ కార్డు వైరల్..



సూపర్ స్టార్ మహేష్ బాబు ప్రస్తుతం ది గ్రేట్ రాజమౌళి దర్శకత్వంలో వారణాసి సినిమా చేస్తున్నాడు. గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా ఇందులో కథానాయిక పాత్రలో కనిపించనుంది. అలాగే మలయాళం సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ అనే విలన్ పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఇండియన్ సినిమా ఇండస్ట్రీలో ఉన్న ది మోస్ట్ హ్యాండ్సమ్ హీరోల్లో మహేష్ కూడా ఒకడు. వయసు పెరుగుతున్నా కొద్దీ అతను మరింత గ్లామరస్‌గా తయారవుతున్నాడు. 'ఎవర్ గ్రీన్ హ్యాండ్సమ్' అనిపించుకుంటున్నాడు. ప్రస్తుతం దర్శక ధీరుడు రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నాడు మహేష్. వారణాసి పేరుతో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో గ్లోబల్ బ్యూటీ ప్రియాంక చోప్రా హీరోయిన్ గా నటిస్తోంది. అలాగే మలయాళ సూపర్ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్ పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. వచ్చే ఏడాది వేసవి కానుకగా ఈ మూవీ ప్రేక్షలకు ముందుకు రానుంది. ఇదిలా ఉంటే మహేష్ బాబు కాలేజ్ డేస్ కు సంబంధించిన ఒక అరుదైన ఐడెంటిటీ కార్డ్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. మహేష్ బాబు చెన్నైలోని ప్రముఖ 'లోయోలా కాలేజ్' లో బి.కామ్ చదువుకున్నారనే విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా బయటకు వచ్చిన ఈ మహేష్ ఐడీ కార్డు నెట్టింట తెగ చక్కర్లు కొడుతోంది. నెట్టింట వైరల్ అవుతున్న ఈ ఐడీ కార్డులో ఉన్న సమాచారం ప్రకారం మహేష్ బాబు పూర్తి పేరు ఘట్టమనేని మహేష్ బాబు. ఐడీ నెంబర్ LCC/1997/4321 కాగా, రోల్ నెంబర్ 97-1186 గా ఉంది. మహేష్ బాబు 1997 నుంచి 2000 సంవత్సరం బ్యాచ్‌లో చెన్నై లోయోలా కాలేజీలో బి.కామ్ కోర్సు చదివినట్లు ఇందులో ఉంది. ఈ కార్డును 15 జూలై 1997న జారీ చేయగా, ఇది మే 2000 వరకు వ్యాలిడిటీ ఉన్నట్లు చూపిస్తోంది. ఇక మహేష్ పుట్టిన తేదీ 09-08-1975గా, బ్లడ్ గ్రూప్ O +ve గా ఇందులో పేర్కొన్నారు. ఇక అడ్రెస్ స్థానంలో హైదరాబాద్‌లోని 'పద్మాలయా స్టూడియోస్, రోడ్ నెం. 12, బంజారాహిల్స్ - 500034' అని రాసి ఉంది. ఈ కార్డుపై ప్రిన్సిపాల్ డాక్టర్ ఎఫ్. ఆండ్రూ సంతకంతో పాటు మహేష్ బాబు చేసిన సంతకం కూడా కనిపిస్తోంది. అయితే ఈ ఐడెంటిటీ కార్డ్ పై నెటిజన్లు భిన్న రకాలుగా స్పందిస్తున్నారు. ఇది ఒరిజినల్ కాదు.. ఫేక్! ఎడిట్ చేసి సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరోవైపు కొంత మంది అప్పట్లో మహేష్ బాబు ఎంతో హ్యాండ్సమ్‌గా ఉన్నారంటూ మురిసిపోతున్నారు. అయితే ఇది ఫేక్ ఐడీ కార్డు అని క్లియర్ గా తెలుస్తోంది. ఎందుకంటే సేమ్ టు సేమ్ ఇది డిజైన్ తో పలువురు స్టార్ హీరోల ఐడీ కార్డులు ఇప్పుడు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.

### మావాడే దగ్గరుండి మరీ ఓడించాడు..

# నా పవర్ ఏంటో ఫైనల్లో చూపిస్తా..

**శుభ్మన్ గిల్ షాకింగ్ కామెంట్స్**



తొలి క్వాలిఫైయర్ మ్యాచ్‌లో ఓడిపోయినప్పటికీ, గుజరాత్ టైటాన్స్‌కు ఫైనల్ చేరడానికి ఇంకా ఒక అవకాశం ఉంది. ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో జరిగే రెండో క్వాలిఫైయర్ మ్యాచ్‌లో గుజరాత్ తలపడనుంది. కనీసం ఆ మ్యాచ్‌కైనా తమ ఫీల్డింగ్ లోపాలను సవరించుకుని, పటిష్టమైన వ్యూహంతో బరిలోకి దిగితేనే గుజరాత్ టైటాన్స్ ఫైనల్ రేసులో నిలవగలదు. ధర్మశాల వేదికగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), గుజరాత్ టైటాన్స్ మధ్య జరిగిన ఐపీఎల్ 2026 తొలి క్వాలిఫైయర్ మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. చేతుల్లోకి వచ్చిన క్యాచ్‌లను చేజేతులా వదిలేసి, ఫీల్డింగ్‌లో ఘోర తప్పిదాలు చేయడం వల్లనే తాము గెలవాల్సిన మ్యాచ్‌ను ఆర్సీబీకి సమర్పించుకున్నామని గుజరాత్ కెప్టెన్ శుభ్మన్ గిల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు.

**చేజేతులా మ్యాచ్ వదిలేసిన గుజరాత్ టైటాన్స్..**

ధర్మశాల మైదానంలో టాస్ గెలిచి అన్నీ అనుకూలంగా ఉన్న వేళ, గుజరాత్ టైటాన్స్ ఆటగాళ్లు మైదానంలో చేసిన చెత్త ఫీల్డింగ్ వారి కొంపముంచింది. ఈ మ్యాచ్‌లో గుజరాత్ ఫీల్డర్లు ఏకంగా మూడు కీలకమైన క్యాచ్‌లను చేజార్చారు. రనౌట్ చేసే సువర్ణ అవకాశాలను కూడా వృథా చేసుకున్నారు. అప్పటివరకు మ్యాచ్‌పై పట్టు సాధించినట్లు కనిపించిన గుజరాత్, ఫీల్డింగ్ వైఫల్యాల కారణంగా ఆర్సీబీకి భారీ స్కోరు చేసే అవకాశాన్ని కల్పించింది.

**మ్యాచ్ స్వరూపాన్ని మార్చేసిన రజత్ పాటిదార్ క్యాచ్ డ్రాప్..!**

ఈ మ్యాచ్‌లోనే అత్యంత ఖరీదైన తప్పిదం 14వ ఓవర్లో జరిగింది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బౌలింగ్‌లో ఆర్సీబీ బ్యాటర్ రజత్ పాటిదార్ గాల్లోకి లేపిన బంతిని కగిసో రబాడ సులువుగా అందుకోవాల్సింది. కానీ, అందరూ అవుట్ అనుకున్న తరుణంలో రబాడ ఆ క్యాచ్‌ను వదిలేశాడు. క్యాచ్ వదిలేసే సమయానికి పాటిదార్ కేవలం 21 పరుగులతో క్రీజులో ఉన్నాడు. ఆ సమయానికి ఆర్సీబీ స్కోరు 14 ఓవర్లలో 140 పరుగులు మాత్రమే. ఆ తర్వాత రజత్ పాటిదార్ చెలరేగిపోయాడు. గుజరాత్ బౌలర్లపై విరుచుకుపడుతూ కేవలం 33 బంతుల్లోనే 93 పరుగులు బాదాడు. దీంతో ఆర్సీబీ ఆఖరి 6 ఓవర్లలో ఏకంగా 114 పరుగులు రాబట్టి, నిర్ణీత ఓవర్లలో 255 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది.

**కొండంత లక్ష్యం.. కుప్పకూలిన బ్యాటింగ్ లైన్ అప్..**


256 పరుగుల భారీ విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్ ఆరంభం నుంచే ఒత్తిడికి లోనైంది. కొండంత లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో వరుసగా వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా పవర్ ప్లేలో ఆశించిన స్థాయిలో పరుగులు రాబట్టలేకపోయింది. అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాయి సుదర్శన్ 'హిట్ వికెట్' రూపంలో దురదృష్టవశాత్తూ అవుట్ కావడం జట్టును కోలుకోలేని దెబ్బతీసింది. చివరికి గుజరాత్ జట్టు కేవలం 162 పరుగులకే ఆలౌట్ అయి ఘోర పరాజయాన్ని చవిచూసింది.

**తప్పులు ఒప్పుకున్న కెప్టెన్ శుభ్మన్ గిల్..**

మ్యాచ్ ముగిసిన అనంతరం గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్మన్ గిల్ తమ ఓటమిపై స్పందించాడు. "మొదటి 12 నుంచి 13 ఓవర్ల వరకు మ్యాచ్‌పై మాకు పూర్తి నియంత్రణ ఉంది. బౌలర్లు బాగానే రాణించారు. కానీ మైదానంలో చేసిన తప్పులు, ముఖ్యంగా రజత్ పాటిదార్ క్యాచ్ వదిలేయడం మాకు భారీ నష్టాన్ని మిగిల్చింది. ఆ ఒక్క క్యాచ్ డ్రాప్‌తో మ్యాచ్ మా చేతుల్లోంచి పూర్తిగా జారిపోయింది. ఆ తర్వాతి ఓవర్లలో మేము భారీగా పరుగులు సమర్పించుకోవాల్సి వచ్చింది. అలాగే బ్యాటింగ్‌లో కూడా మాకు సరైన ఆరంభం దక్కలేదు. సాయి సుదర్శన్ అలా అవుట్ అవ్వడం నిజంగా దురదృష్టకరం" అని గిల్ ఆవేదన వ్యక్తం చేశాడు.

### ఇకపై ఏడాదికి 2సార్లు ఐపీఎల్..

# బీసీసీఐ సంచలన నిర్ణయం..



ఏడాదికి రెండు ఐపీఎల్ టోర్నీలనే ప్రతిపాదన నిజమైతే క్రికెట్ ప్రేమికులకు అంతకంటే కావలసింది ఏముంటుంది! ప్రస్తుత సీజన్ లో ఎవరు విజేతగా నిలుస్తారనే ఉత్కంఠ ఒకవైపు ఉంటే, భవిష్యత్తులో ఐపీఎల్ రూపురేఖలు ఎలా మారబోతున్నాయనే ఆసక్తి మరోవైపు క్రికెట్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ప్రపంచంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన లీగ్ 'ఇండియన్ ప్రీమియర్ లీగ్' (ఐపీఎల్) అభిమానులకు బీసీసీఐ త్వరలోనే ఒక భారీ తీపి కబురు అందించబోతోంది. ఇకపై ఏడాదికి ఒకసారి కాకుండా, రెండు విభిన్న సమయాల్లో ఐపీఎల్ నిర్వహించేలా సరికొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. ఈ మేరకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ కీలక నిర్ణయాల దిశగా అడుగులు వేస్తోంది.

**పండుగ సీజన్‌పై కన్నేసిన బోర్డు.. ఇక డబుల్ వినోదం!**

ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ తాజాగా లీగ్ విస్తరణపై సంచలన విషయాలను పంచుకున్నారు. ప్రస్తుతం మార్చి నుంచి మే వరకు రెండు నెలల పాటు సాగే ఈ టోర్నీని మరింత పెద్దదిగా మార్చాలని బోర్డు భావిస్తోంది. ప్రస్తుతమున్న 74 మ్యాచ్‌ల సంఖ్యను భవిష్యత్తులో 94 మ్యాచ్‌లకు పెంచాలనేది బీసీసీఐ అసలు ప్రణాళిక. అయితే, జూన్ నెలలో భారతదేశంలో ఉండే తీవ్రమైన ఎండలు, ఉక్కపోత వల్ల ఆటగాళ్లకు, మైదానానికి వచ్చే అభిమానులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలోనే ఏడాదిని రెండు భాగాలుగా విభజించి ఐపీఎల్ నిర్వహించే ఆలోచన చేస్తున్నారు. దీని ప్రకారం, మొదటి విడతను ఫిబ్రవరి నుంచే ప్రారంభించి ఏప్రిల్ లోపు ముగించడం, ఆ తర్వాత రెండో విడతను సెప్టెంబర్ - అక్టోబర్ నెలల మధ్య నిర్వహించడంపై కసరత్తులు జరుగుతున్నాయి. ముఖ్యంగా దసరా, దీపావళి వంటి పండుగల సమయంలో భారత్‌లో వ్యాపార ప్రకటనల సందడి ఎక్కువగా ఉంటుంది కాబట్టి, ఆ సమయాన్ని అందిపుచ్చుకోవాలని బోర్డు భావిస్తోంది. అయితే, ప్రసారదారులతో (బ్రాడ్‌కాస్టర్స్) చర్చించిన తర్వాతే దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు.

**అంతర్జాతీయ క్రికెట్‌పై దీని ప్రభావం ఎంత?**

ఈ ప్రతిపాదన కేవలం భారత క్రికెట్ బోర్డుకు మాత్రమే పరిమితం కాదు. ఐపీఎల్ జరిగే సమయంలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న అగ్రశ్రేణి ఆటగాళ్లంతా ఇక్కడే ఉంటారు కాబట్టి, ఇతర దేశాల క్రికెట్ బోర్డులతో కూడా చర్చలు జరపాల్సి ఉంటుంది. అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో, అంతర్జాతీయ క్రికెట్ క్యాలెండర్‌కు ఇబ్బంది కలగకుండా ఈ ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషిస్తున్నట్లు అరుణ్ ధుమాల్ స్పష్టం చేశారు.

**తుది సమరానికి బెంగళూరు.. నేడే చావో రేవో ఎలిమినేటర్..!**

ప్రస్తుత ఐపీఎల్ 2026 సీజన్ విషయానికి వస్తే, టోర్నీ ఆఖరి ఘట్టానికి చేరుకుంది. క్వాలిఫైయర్-1 పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు గుజరాత్ టైటాన్స్ పై ఘనవిజయం సాధించి నేరుగా ఫైనల్‌కు దూసుకెళ్లింది. మే 31న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో ఈ తుది సమరం జరగనుంది. మరోవైపు, నేడు ముల్లాన్‌పూర్ వేదికగా రాజస్థాన్ రాయల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య అత్యంత ఉత్కంఠభరితమైన 'ఎలిమినేటర్' మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్ చేరడం కోసం క్వాలిఫైయర్-2లో గుజరాత్ టైటాన్స్ తో తలపడాల్సి ఉంటుంది. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమిస్తుంది. దీంతో ఈ మ్యాచ్ పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.




VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com